

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం12 డిసెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 110 పేజీలు : 4 వెల : రూ 3-00

## సరయు కెనాల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ



బలరాంపూర్: ఘాఘ్రు, సరయు, రప్తి, బాన్‌గంగ, రోహిణి నదులను అనుసంధానిస్తూ రూ.9,800 కోట్లతో నిర్మించిన సరయు నహర్ నేషనల్ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ శనివారంనాడు ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, బలరాంపూర్ నుంచే మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిన తన పార్లమెంటరీ జర్నీ ప్రారంభించారని గుర్తుచేసుకున్నారు.బలరాంపూర్ ప్రిన్స్‌లీ స్టేట్ మహారాజా పటేశ్వరి ప్రసాద్ సింగ్ సాహెబ్ పేరును ప్రస్తావిస్తూ, అయోధ్యలో రామాలయం గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా, మహారాజా పటేశ్వర్ సింగ్ సాహెబ్ పేరు ప్రస్తావించకుండా ఉండలేమని అన్నారు. బలరాంపూర్ ప్రజలకు కళల పట్ల ఎంతో మమకారమని, నానాజీ దేశ్‌ముఖ్, అటల్ బిహారీ వాజ్‌పేయి రూపంలో ఇద్దరు భారతరత్నలను అందించారని ప్రశంసించారు. బలరాంపూర్‌తో వాజ్‌పేయికి విడదీయరాదని అనుబంధం ఉందని, వాజ్‌పేయి తొలినాళ్లలో ఆయనను చూసిన వారు ఇప్పటికీ ఆయన గురించి మాట్లాడుకుంటూ ఉంటారని అన్నారు. 1957 సార్వత్రిక ఎన్నికల్లో వాజ్‌పేయి జన్‌సంఘ్ అభ్యర్థిగా మూడు సీట్లలో పోటీ చేశారు. బలరాంపూర్ నుంచి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. 1962లో బలరాంపూర్, లక్నోల్లో పోటీ చేసి రెండు చోట్లా ఓడిపోయారు. 1967లో బలరాంపూర్ నుంచి మరోసారి పోటీచేసి గెలుపొందారు.కాగా, పీఎంఓ అధికార ప్రకటన ప్రకారం, సరయు కెనాల్ ప్రాజెక్టును 1978లోనే ప్రారంభించారు. అయితే నిలకడైన బడ్జెటరీ సపోర్ట్, సంబంధిత శాఖల మధ్య సమన్వయలోపం, సరైన నిఘా లోపం కారణంగా నాలుగు దశాబ్దాలైనా పూర్తి కాలేదు. 2016లో ఈ ప్రాజెక్టును ప్రధాన్ మంతరి క్రిషి సించాయీ యోజన కింద చేర్తి నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేశారు. మొత్తం రూ.9,800 కోట్ల వ్యయంలో రూ.4,600 కోట్లు గత నాలుగేళ్లలోనే కేటాయించారు. ఈ ప్రాజెక్టుతో 14 లక్షల హెక్టార్ల భూములకు సాగు నీరు అందుతుంది. 6,200 గ్రామాల్లోని 29 లక్షల రైతులకు లబ్ధి చేకూరుతుంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది జిల్లాలు-బహ్‌రిచ్, శ్రవస్తి, బలరాంపూర్, గోండ, సిద్ధార్థ్‌నగర్, బస్తి, సంత్ కబీర్ నగర్, గోరఖ్‌పూర్, మహారాజ్‌గంజ్‌లకు ప్రయోజనం చేకూరుతుంది.

## నేడు విశాఖ ఉక్కు కోసం పవన్ దీక్ష

విశాఖపట్టణం, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. మళ్ళీ విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని చాటనున్నారు. విశాఖలోని ఉక్కు పరిశ్రమని ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ.. జనసేనాని.. ఒక్కరోజు దీక్ష చేయనున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు సంఘీభావంగా?పవన్ కళ్యాణ్ ఈనెల 12వ తేదీన ఈ దీక్షను చేయనున్నారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పవన్ కళ్యాణ్ దీక్షను చేయనున్నారని పార్టీ వర్గాలు ప్రకటించాయి, ఈ మేరకు ఇప్పటికే పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ విషయంలో ఏపీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని పవన్ కళ్యాణ్ విమర్శించారు. తాను గతంలో విశాఖ ఉక్కు పై అఖిలపక్షాన్నీ ఏర్పాటు చేసి.. ఢిల్లీ తీసుకుని వెళ్లాలని చెప్పినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని అన్నారు. అందువల్లనే ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం తమ పార్టీ తరపున పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నేతలను ఢిల్లీ తెలుసుకుని వెళ్లి.. మన గళం వినిపించాలంటూ జనసేనాని డిమాండ్ చేశారు.కార్మికులు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు పరిశ్రమ ప్రయివేటీకరణను నిరసిస్తూ.. గత 300 రోజులుగా నిరవధికంగా ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ కేంద్రం వెనక్కి తగ్గలేదు. ఇప్పటికే అన్ని రకాల చర్యలను కూడా ప్రారంభించేసింది. దీంతో స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు కార్మికులకు మద్దతుగా డిసెంబర్ 12న మంగళ గిరి లోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ నిరాహార దీక్ష జరుగుతుందని జనసేన పార్టీ నేతలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షా కార్యక్రమంలో పవన్ కళ్యాణ్?తో పాటు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ ముఖ్య నేతలు పాల్గొననున్నారు.ఆంధ్రపదేశ్ లో పవన్ కల్యాణ్ బీజేపీకి మద్దతుఇస్తున్న సంగతి తెలిసిందే.. అయితే కేంద్ర లో అధికారంలో ఉన్న బీజేపీ.. విశాఖ ఉక్కు పరిశ్రమని ప్రయివేట్ పరం చేయాలనీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా పవన్ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదాన్ని మరోసారి తెరపైకి తీసుకుని రావడం.. ఉద్యోగుల ఆందోళలకు మద్దతు పలకడం.. ఇప్పుడు దీక్షను చేపట్టడం.. సర్వత్రా చర్చనీయాంశమయింది.

### రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోలు: మంత్రి కన్నబాబు

తాడేపల్లి: రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో మిల్లర్లు, దళారుల ప్రమేయం తగ్గించామని పేర్కొన్నారు. అధిక వర్షాలతో కొన్ని జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటివరకూ 2,36,880 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 7వేలకు పైగా ఆర్బీకేలలో ధాన్యం సేకరణ ఏర్పాటు చేశామని మంత్రి కన్నబాబు పేర్కొన్నారు.

## సంక్రాంతి నుంచి దర్శనాల సంఖ్య పెంచుతాం: టీటీడీ చైర్మన్



తిరుమల: టీటీడీ పాలకమండలి సమావేశం ముగిసింది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన అన్నమయ్య భవనంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 'అన్నమయ్య మార్గాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అన్నమయ్య మార్గంలో రోడ్డు, కాలినడక మార్గాలను నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తాం. త్వరలోనే పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి రోడ్డు, కాలినడక మార్గాలను నిర్మిస్తాం. కరోనా మార్గదర్శకాలు సడలించే అవకాశం ఉంటే సంక్రాంతి నుంచి దర్శనాల సంఖ్య పెంచుతాం. దర్శనాల సంఖ్య పెంపుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాయాలని నిర్ణయించాం.తిరుపతిలో ప్రారంభించిన పిడియాట్రిక్ ఆసుపత్రిలో విజయవంతంగా హార్ట్ సర్జరీలు జరుగుతున్నాయి. నెల రోజుల్లో 11 మంది పిల్లల ప్రాణాలు కాపాడాం. పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రిని పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రికి విరాళమిచ్చే దాతలకు ఆర్జిత సేవల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని నిర్ణయించాం. హనుమ జన్మస్థలమైన ఆకాశగంగను విరాళాల ద్వారా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. కడప జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్ట్ తెగిపోవడంతో దెబ్బతిన్న ఆలయాలను పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నాం.శ్రీవారి ఆలయం ఎదురుగా నిర్మిస్తున్న పరకామణి భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం. పరకామణిలో చిల్లర నాణేల ప్యాకింగ్‌కు రూ.2.80 కోట్లతో యంత్రాలు కొనుగోలు చేస్తున్నాం. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల్లోని గిరిజనులు, మత్స్యకారులను తీసుకొచ్చి దర్శనాలు చేయించాలని నిర్ణయించాం. శ్రీ వేంకటేశ్వర నామకోటి పుస్తకాలను ప్రచురించాలని నిర్ణయించాం. కళ్యాణకట్ట క్షురకులకు పీస్ రేట్ రూ.11 నుండి రూ.15 కు పెంచాలని నిర్ణయించాం.ఎఫ్ఎంఎస్ కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో కమిటీ వేశాం. కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు టీటీడీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. సీఎం హామీ మేరకు టీటీడీలో పనిచేసే కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో కలిపాం. కాంట్రాక్టర్ కింద పని చేసే కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ లో కలపలేం. ఇప్పటి దాకా టీటీడీకి ప్రత్యేకమైన ఐటీ వింగ్ లేదు. టీటీడీ ఐటీ వింగ్ కోసం అర్హత కలిగిన ఉద్యోగులతో ప్రత్యేక టీటీడీ ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తాం' అని చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు.

## పినాకా-ఈఆర్ రాకెట్ పరీక్ష సక్సెస్

పోఖ్రాన్: పినాకా రాకెట్ వ్యవస్థకు చెందిన ఎక్స్‌టెండెడ్ రేంజ్‌ను ఇవాళ విజయవంతంగా పరీక్షించారు. రక్షణ మంత్రిత్వశాఖ ఈ విషయాన్ని తెలిపింది. గత మూడు రోజుల నుంచి దశల వారీగా విజయవంతంగా టెస్టింగ్ సాగుతోంది. పోఖ్రాన్ ఫీల్డ్ రేంజ్‌లో ఈ టెస్టింగ్ జరిగింది. డీఆర్డీవో టెక్నాలజీ సాయంతో ప్రైవేటు ఇండస్ట్రీ ఆ రాకెట్ వ్యవస్థను డెవలప్ చేసింది. వివిధ రకాల సామర్థ్యం ఉన్న వార్‌హెడ్స్ తో పినాకా రాకెట్లను పరీక్షించామని, అన్ని ట్రయల్స్‌లోనూ సంతృప్తికరంగా ఫలితాలు వచ్చినట్లు రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పినాకా ఎంకే-ఐ రాకెట్ వ్యవస్థ సుమారు 40 కిలోమీటర్ల ఉన్న టార్గెట్‌ను ధ్వంసం చేయగలదు. అలాగే పినాకా-2 వేరియంట్ 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను చిత్తు చేస్తుంది. ఇక పినాకా-ఈఆర్ రేంజ్‌ను మాత్రం ఇంకా వెల్లడించలేదు. అయితే వివిధ రేంజ్‌ల్లో ఉన్న టార్గెట్లపై 24 రాకెట్లను పరీక్షించినట్లు తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించే కంచెను బలోపేతం చేయాలి : జో బైడెన్




వాషింగ్టన్ : దాడులు చేసే నియంతృత్వ శక్తులను ఎదిరించి నిలిచే శక్తిని ఇచ్చే ప్రజాస్వామ్య రక్షణ కంచెను మరింత బలోపేతం చేయవలసిన బాధ్యత అందరికీ ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. ఓటు హక్కుకు సంబంధించిన చట్టాలు చేయడం ద్వారా తాను అమెరికాలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన 'సమ్మిట్ ఫర్ డెమొక్రసీ' శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు 100 దేశాలను ఆహ్వానించగా 89 దేశాలు, యూరోపియన్ యూనియన్ పాల్గొన్నాయి. బైడెన్ మాట్లాడుతూ, 'సమ్మిట్ ఫర్ డెమొక్రసీ' సదస్సును వచ్చే ఏడాది కూడా నిర్వహిస్తామని, వివిధ దేశాల నేతలందరూ వ్యక్తిగతంగా హాజరయ్యేం దుకు వీలుగా దీనిని నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వాధినేతలుగా మనకు బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. ఆ బాధ్యతలను వివరిస్తూ, ప్రజల మాటను వినడం, ప్రజాస్వామ్యాన్ని రక్షించే కంచెను కాపాడటం, సంస్కరణలను పారదర్శకంగా అమలు చేయడం, జవాబుదారీతనంగల ప్రభుత్వాలు, ప్రభుత్వ పరిపాలన, నియం తృత్వ శక్తుల దాడులకు వ్యతిరేకంగా గట్టిగా నిలదొక్కుకునే సామర్థ్యాన్ని పెంచుకోవడం వంటి బాధ్యతలు దేశాధినేతలకు ఉన్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లను, వాటిని ఎదుర్కొని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు గల అవకాశాలను ఈ రెండు రోజుల సదస్సులో ప్రభుత్వాధినేతలు చెప్పారని తెలిపారు. మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం చాలా ముఖ్యమైన విషయమని ఈ సమావేశం స్పష్టం చేసిందన్నారు. మహిళలు, బాలికల హోదాను పెంచడం ప్రజాస్వామ్యానికి పెట్టుబడివంటిదని పేర్కొన్నారు. మానవ హక్కుల మద్దతుదారులను సాధికారులను చేయడంపై ఈ సదస్సులో దృష్టి పెట్టామన్నారు. ప్రభుత్వాలు ప్రజలను ఉద్ధరించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, వారిని అణగదొక్కడానికి కాదని చెప్తూ, ఈ అంశాలపై ఈ సదస్సు దృష్టి పెట్టిందని చెప్పారు. చైనాలో వీఘర్ ముస్లింలపై నిఘా పెట్టడం కోసం టెక్నాలజీని వాడుతుండటాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

## ప్రత్యేక హోదా కోసం రాజీనామాకు సిద్ధమా?

### వైసీపి ప్రభుత్వానికి చంద్రబాబు సవాల్



విజయవాడ, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తారు. ప్రత్యేక హోదా సాధించేందుకు తమ పార్టీ ఎంపీలు రాజీనామాకు సిద్ధమన్నారు. వైసీపీ ఎంపీలు కూడా రాజీనామా చేసేందుకు ముందుకు రావాలని ఛాలెంజ్ విసిరారు. ఈ విషయంలో వైసీపీ మాయ మాటలు, సన్నాయి నొక్కులు మానుకుని సూటిగా స్పందించాలన్నారు. రెండు పార్టీల ఎంపీలూ రాజీనామా చేసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడుదామంటూ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని కేంద్రం ఇటీవల ప్రకటించిందని గుర్తు చేశారు. మరి రాష్ట్ర ప్రభుత్వం, వైసీపీ ఎంపీలు ఏం చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రజలను ఇంకెన్నాళ్లు మభ్యపెడుతారంటూ విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామని.. లేని పక్షంలో పదవులకు రాజీనామా చేస్తామని గతంలో జగన్ చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎందుకు హోదా సాధించలేకపోయారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇది ప్రజలను మోసగించడం.. దగా చేయడం కాదా? అని ప్రశ్నించారు. విభజన హామీలను సాధించడంలోనూ జగన్ సర్కారు ఘోరంగా విఫలం చెందిందన్నారు.వైసీపీ అవకాశవాద రాజకీయాలు చేస్తోందని చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిని రాజధానిగా ఒప్పుకున్న వ్యక్తి.. ఇప్పుడు ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ధ్వజమెత్తారు. అన్ని విషయాల్లోనూ యూ టర్న్ తీసుకున్నారని విమర్శించారు. జగన్ సర్కారుపై రాష్ట్ర ప్రజల్లో రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందన్నారు. త్వరలోనే ప్రజల నుంచి తిరుగుబాటు కూడా వస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని పాలించే హక్కు వైసీపీ కోల్పోయిందన్నారు.ఓటీఎస్ విషయంలో తాము వదిలిపెట్టేది లేదని చంద్రబాబు అన్నారు. ఇళ్ల పట్టాలని రిజిస్ట్రార్ రిజిస్ట్రేయాల్ చేయాలి తప్ప.. ఎవరుపడితే వాళ్ల రిజిస్ట్రేషన్ చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరూ డబ్బులు కట్టవద్దు.. తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.

## రావత్‌ను రోల్‌మోడల్‌గా తీసుకోండి: రాష్ట్రపతి



సీడీఎస్ బిపిన్‌రావత్‌ను రోల్‌మోడల్‌గా తీసుకుంటూ, కెరీర్‌లో ముందుకు సాగాలని సైనిక విధుల్లో చేరుతున్న వారికి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సూచించారు . డెహ్రాడూన్ మిలటరీ అకాడమీ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ మాట్లాడుతూ.. బిపిన్ రావత్ లేనిలోటు పూడ్చలేనిదన్నారు. ఆయనో అసాధారణ వ్యక్తి అని కొనియాడారు. ఒకవేళ హెలికాప్టర్ దుర్ఘటన జరగకపోయి ఉంటే, ఈ రోజు రావత్ కూడా తనతో కలిసి ఈ పరేడ్‌లో పాలుపంచుకునేవారని కోవింద్ గుర్తు చేసుకున్నారు. నూతనంగా సైన్యంలో చేరుతూ, తమ శిక్షణను పూర్తి చేసుకున్న వారికి కోవింద్ శుభాకాంక్షలు తెలిపారు.బిపిన్ రావత్ దుర్మరణం అన్న షాక్ నుంచి తేరుకోక మునుపే ఇక్కడ సమావేశమయ్యామని, రావత్ ఈ కేంద్రంలోనే శిక్షణ తీసుకొని, అనేక మెడల్స్‌ను సాధించారని రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. రక్షణ విషయంలో దేశం ఓ సవాల్‌ను ఎదుర్కొంటోందని, దీనికి అందరూ మానసికంగా సన్నద్ధమై ఉండాలని, ఓ వ్యూహాత్మకమైన మానసిక పరిణతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనుకోని సవాళ్లు ఎదురైనప్పుడు కూడా వాటిని ఎదుర్కోడానికి సంసిద్ధత వ్యక్తం చేసేలా ఉండాలని రాష్ట్రపతి కోవింద్ ఆకాంక్షించారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసు

### దూకుడు పెంచిన సీఐడీ

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కేసులో సీఐడీ దూకుడు పెంచింది. ఈ కేసులో రూ.242 కోట్ల స్వాహాపై విచారణ చేపట్టింది. ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకుని సీఐడీ విచారిస్తోంది. వీరిని వేర్వేరు ప్రాంతాల్లో విచారిస్తున్న సీఐడీ.. ఇవాళ అరెస్టు చూపించే అవకాశం ఉంది.స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను అడ్డుపెట్టుకుని గత టీడీపీ ప్రభుత్వ పెద్దలు భారీగా దోపిడీకి పాల్పడ్డారు. ఈ కేసులో అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ?సీఈవో గంటా సుబ్బారావు, డైరెక్టర్‌గా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీ నారాయణ, ఎస్‌డీఈఐ కార్యదర్శికి ఓఎస్డీగా ఉన్న నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, ఇతర అధికారులు, సీమెన్స్, డిజైన్ టెక్, స్కిల్లర్, ఏఐసీ తదితర కంపెనీలకు చెందిన అప్పటి ఎండీలు, ఇతర ప్రతినిధులతో సహా మొత్తం 26 మందిపై సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

# సంపాదకీయం

ఆదివారం 12 డిసెంబరు 2021

## కీలకంగా మారనున్న తృణమూల్

కాంగ్రెస్ పార్టీలో చీలికలు కొత్త కాదు. నిజానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నిసార్లు చీలిపోయిందో, ఆ అమ్మ కడుపులోంచి ఎన్ని పిల్ల కాంగ్రెస్'లు పుట్టుకొచ్చాయో,అందులో ఎన్ని బతికి బట్టకట్టాయో, ఎన్ని మళ్ళీ మాతృ సంస్థలో విలీనం అయ్యాయో.. అదంతా పాత చరిత్ర. నిజానికి ప్రస్తుతం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీగా చెలామణి అవుతున్న, సోనియా గాంధీ సారధ్యంలోని కాంగ్రెస్ పార్టీ కూడా, 1969లో మాతృ సంస్థ నుంచి, బహిష్కరణకు గురైన, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పెట్టిన పిల్ల కాంగ్రెస్ పార్టీనే. సరే, ఆతర్వాత న్యాయ,రాజకీయ పోరాటంలో విజయం సాధించి ఇందిరా గాంధీ, విజయేందిర నిలిచారు. భారత్ జాతీయ కాంగ్రెస్ పార్టీని సొంతం చేసుకున్నారు. అది వేరే విషయం.అయితే, గతంలో ఎప్పుడూ కూడా, తల్లి పేగు తెంచుకుని బయటకు వెళ్లి పోయిన పిల్ల కాంగ్రెస్ వచ్చి, 'నాదే నిజమైన కాంగ్రెస్, మీరు బయటకు దయ చేయండి' అని, తల్లి కాంగ్రెస్ పార్టీని రాజకీయ యవనిక నుంచి బయటకు పొమ్మని అనలేదు. కానీ, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, మాత్రం కాంగ్రెస్ పార్టీని 'యుద్ధంలో అలసిపోయిన కురువృద్ధ పార్టీ'గా అభివర్ణించారు.అర్ధశతాబ్దికి పైగా, దేశాన్ని పాలించిన పార్టీని గుడ్డొచ్చి పిల్లను ఎక్కిరించినట్లు దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను నిర్వర్తించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, తృణమూల్ కాంగ్రెస్ ఎక్కిరిస్తోంది. అంతే కాదు, తామే 'నిజమైన కాంగ్రెస్' అని తృణమూల్ అధికార పత్రికలో ప్రకటించుకుంది. సొంత రాతలుర్సుకుంది. నిజమే రాహుల్ గాంధీ పుణ్యాన కాంగ్రెస్ పార్టీ బలహీన పడింది. అది నిజం. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఏనాడు లేని విధంగా వరసగా రెండు సార్లు ఎన్నికల్లో ఓడిపోవడమే కాకుండా, రెండు సార్లు రెండంకెల స్థానాలకే పరిమితం అయింది. అయినా, ఈనాటికి కూడా, దేశంలో కాంగ్రెస్ పార్టీకి 20 శాతం వరకు ఓటు షేర్ ఉంది. బీజేపీ తర్వాత ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీ, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటుగా, ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలోనూ ఎక్కువ రాష్ట్రలలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీనే. అయినా, తృణమూల్ కాంగ్రెస్, విపక్షాలకు నాయకత్వం వహించే అంశంపై దేశంలో జరుగుతున్న చర్చలో, కాంగ్రెస్ పాత్రను చిన్నగా చేసి చూపేందుకు, చులకన చేసేందుకు ప్రయత్నిస్తోంది. బాహాటంగానే విమర్శిస్తోంది. వరసగా మూడవ సారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఉత్సాహంలోనో, లేక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత కిశోర్ వ్యూహంలో భాగంగానో, కొత్త పిచ్చోడు పొద్దెరగడు అన్నట్లుగా బీజేపీ పోరాడే శక్తి తమకు మాత్రమే ఉందని తృణమూల్ సొంత పత్రిక సొంతవిశ్లేషణ చేసింది. ఈ మేరకు పార్టీ అధికార పత్రిక 'జాగో బంగ్లా'లో ప్రచురించిన వ్యాసంలో .'విపక్షాలను ముందుకు తీసుకెళ్లే అంశంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పాత్ర అసమర్థంగా ఉంది' అని మమత పార్టీ రచయితలు పేర్కొన్నారు. ."కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్.. బీజేపీ జోరును ఆపగలగాలి. కానీ.. అంతర్గత కుమ్ములాటలు, కక్షలతో ఆ పార్టీ నలిగిపోతోంది. అయితే కాలం ఎవరి కోసం ఎదురుచూడదు. బీజేపీని ఎదుర్కొనేందుకు మరొకరు ముందుకు రావాలి. టీఎంసీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఇదే నిజమైన కాంగ్రెస్" అంటూ జాగో బంగ్లా సంపాదకీయ కథనంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్నపోరాటంలో రాహుల్ గాంధీ కంటే, మమతా బెనర్జీయే కీలకంగా మారారని కూడా 'జాగో బంగ్లా' పేర్కొంది అంతేగాక విపక్షంగా తాము అన్ని పార్టీలను కలుపుని వెళ్లాలని టీఎంసీ కోరుకుంటోందని వెల్లడించింది. ఫలితంగా కాంగ్రెస్–టీఎంసీ మధ్య సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి.మేఘాలయల సహా పలు రాష్ట్రాలలో కాంగ్రెస్ నాయకులను తమ వీపుకు తిప్పుకుంటోంది. మేఘాలయలో మాజీ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా నేతృత్వంలోని 17 మంది ఎమ్మెల్యేలలో 12 మంది ఇటీవల టీఎంసీలో చేరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్‌తో కలసి పనిచేసేందుకు టీఎంసీ ఆసక్తి చూపించలేదు.ఆసక్తి చూపించక పోవడమే కాదు, కాంగ్రెస్ పార్టీని, ఓ అనామక, అర్భక పార్టీ అనే ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తోంది. మరో వంక కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేతలు చాలా వరకు దూరం కావడంతో, తృణమూల్ దూకుడుకు కళ్ళెం వేసే నాయకులు కరువయ్యారని, కాంగ్రెస్ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

# మళ్లీ జిల్లాల రచ్చ

శ్రీకాకుళం, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)సీఎం జగన్ తీసుకున్న కొత్త జిల్లాల ఏర్పాటు అంశం.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తానని జగన్ ప్రకటించారు. దీనికి సంబంధించిన కసరత్తును కూడా ప్రారంభించారు. ఇప్పటికే కమిటీలు వేశారు. కేబినెట్‌లోనూ చర్చించారు. మొత్తంగా ఒక వ్యూహం ప్రకారం కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇంత వరకుబాగానే ఉంది. రాష్ట్రంలో ఇప్పుడున్న 13 జిల్లాలు 25 లేదా అరకును రెండు చేస్తే.. 26 జిల్లాలు ఏర్పడతాయి.అయితే.. ఇక్కడే అసలు సిసలు సమస్య అధికార పార్టీ నేతలను ఇరుకున పెడుతోంది. ఇప్పటికే ప్రస్తుతం ఉన్న చాలా జిల్లాల్లో మా ప్రాంతాన్ని జిల్లా చేయాలంటే.. మా ప్రాంతాన్ని జిల్లా చేయాలంటూ.. ఉద్యమాలు వస్తున్నాయి. కొన్ని చోట్ల తమ ప్రాంతాలు / నియోజకవర్గాలకు కొత్త జిల్లాల్లో కలపవద్దని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో జిల్లా కేంద్రాల ఏర్పాటు కూడా తలనొప్పిగా మారింది. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరికీ ఏమీ చెప్పలేక.. తాము ఏమీ చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఇది చివరికి తమ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుందేమో.. అని తర్జన భర్జన పడుతున్నారు. ఇలాంటి సమస్యే ఇప్పుడు శ్రీకాకుళంలోనూ వచ్చింది.వాస్తవానికి శ్రీకాకుళం జిల్లాను విభజించి రెండు జిల్లాలు చేయొద్దని.. వైసీపీ నాయకులే కోరుతున్నారు. దీనివల్ల ఇప్పటికే వెనుకబడిన జిల్లా కాస్తా.. మరింత వెనుకబడుతుందని వారు అంటున్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో బహిరంగంగానే ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శించారు. ఇక గుంటూరు, నెల్లూరు, మదనపల్లి లాంటి చోట్ల కూడా సొంత పార్టీ నేతల నుంచి ఇదే తరహా అ భ్యంతరాలు జోరందుకున్నాయి. చివరకు జగన్ వార్నింగ్ ఇస్తే గాని వీరు వెనక్కు తగ్గలేదు.ఇదిలా వుంటే శ్రీకాకుళం జిల్లాలోని ఎస్టీ నియోజకవర్గం పాలకొండలో మరో సరికొత్త డిమాండ్ ఊపందుకుంది. పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలంటూ.. ఇక్కడి ప్రజలు ఉద్యమిస్తున్నారు. తమను అరకు లేదా పార్వతీపురం జిల్లాల్లో కలిపితే సహించమని.. పాలకొండను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ఉద్యమిస్తుండడంతో ఎమ్మెల్యే కళావతి ఇరుకున పడుతున్నారు. ఈ ఉద్యమంలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. వీళ్లకు టీడీపీ బలంగా సపోర్ట్ చేస్తోంది.ఇప్పటికే రెండుసార్లు వరుసగా గెలిచిన కళావతికి గిరిజనుల్లో మంచి పట్టుంది. ఎస్టీ వర్గంలో వైసీపీ ఆమె మంచి లీడర్‌గా ఎదిగే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలోనే తాజా డిమాండ్‌తో ఆమె తన ఓటు బ్యాంకు ఎక్కడ చెల్లాచెదరవుతుందో ? అన్న ఆందోళనతో ఉన్నారు. ఎందుకంటే.. ఈ డిమాండ్ ఎలాగూ నెరవేరదు. పైగా ఎవరూ పట్టించుకునే పరిస్థితి కూడా లేదు. దీంతో ఆమె ఈ విషయాన్ని తాజాగా జగన్‌కు వివరించాలని చూస్తున్నారు.

# రసకందాయంలో గుంటూరు రాజకీయాలు

గుంటూరు, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)చిలకలూరిపేట రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఎమ్మెల్యే విడుదల రజనీ, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ మధ్య విభేధాలు మరోసారి బయటపడ్డాయి. వైసీపీ ఏర్పాటు నుంచి పార్టీలో ఉన్న మర్రి రాజశేఖర్ కు 2019లో పేట టికెట్ ఇవ్వలేదు. ఆర్థికంగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలన్న నిర్ణయంతో బీసీ మహిళైన రజనీకి పార్టీ అధినేత జగన్ అవకాశం ఇచ్చారు. టీడీపీ నేత పుల్లారావుపై పోటీ చేయటానికి విడుదల రజని కూడా ముందుకొచ్చారు. అయితే ఆమె గెలిస్తే మర్రి రాజశేఖర్ కు సముచిత స్థానం ఇస్తామని జగన్ బహిరంగంగానే ప్రకటించారు. జగన్ మాటపై విశ్వాసంతో రజనీ గెలుపు కోసం రాజశేఖర్ కూడా తీవ్రంగా శ్రమించారు. 2019 ఎన్నికల్లో విడుదల రజనీ పుల్లారావుపై విజయం సాధించారు.అయితే అప్పటి నుండి రాజకీయాలు శర వేగంగా మారిపోయాయి. నియోజకవర్గంలో రజనీ పట్టు సాధిస్తుండటంతో మర్రి వర్గంలో ఆందోళన మొదలైంది. దీంతో ఆమెకు చెక్ పెట్టేందుకు మర్రి తన అనుచరులను రంగంలోకి దింపారు. ఇక్కడే మర్రి రాజశేఖర్ కు అనుకూలంగా నర్సరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే రజని, ఎంపీ కృష్ణదేవరాయలకు ఎన్నికల సమయం నుండి విబేధాలున్నాయిశత్రువుకు శత్రువు మిత్రుడు అన్న సామెతను నిజం చేస్తూ మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, ఎంపీ కృష్ణదేవరాయలు ఒక్కటయ్యారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి మద్దతునివ్వటం ప్రారంభించారు. దీన్ని పసిగట్టిన ఎమ్మెల్యే తన వర్గాన్ని వాళ్ళకి వ్యతిరేకంగా రంగంలోకి దింపారు. దీంతో రెండు మూడు చోట్ల ఎమ్మెల్యే ప్రమేయం లేని కార్యక్రమాలకు ఎంపీ హాజరు కావడం, వారిని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకోవడం జరిగింది. ఎమ్మెల్యే రజని తమను కలుపుకోనిపోవటం లేదని ఎంపీ, మాజీ ఎమ్మెల్యే వర్గం ఆరోపిస్తే.. వారిద్దరూ నాకు సహకరించడం లేదని ఎమ్మెల్యే రజనీ ప్రత్యారోపణలు చేశారు.ఇది ఇలా ఉండగానే రెండేళ్ళ గడిచిపోయాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు రావటంతో మర్రి రాజశేఖర్ కు ఆ పదవి వస్తుందని అంతా ఆశించారు. అయితే గవర్నర్ కోటాలో అప్పిరెడ్డికి, స్థానిక సంస్థల కోటాలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావుకి సీఎం అవకాశమిచ్చారు. ఈ నిర్ణయంతో.. ఎమ్మెల్సీ అయినా వస్తే ఎమ్మెల్యే రజనికి చెక్ పెట్టవచ్చని భావించిన మర్రి ఆశలు అడియాసలయ్యాయి. దీంతో ఆయన వర్గం భగ్గుమంటుంది.తాజాగా మాజీ సీఎం రోశయ్య సంస్మరణ సభలో మర్రి రాజశేఖర్ బావ, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య కొడుకు వెంకట సుబ్బయ్య వైసీపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఇవ్వకుండా మోసం చేశారన్నారు. గుండెల్లో పెట్టుకుంటామని చెప్పి మాట తప్పారన్నారు. వైసీపీలో తమ కులం లేదంటూ సామాజిక వర్గాన్ని తీసుకొచ్చారు. ఇదే సమయంలో చిలకలూరిపేట మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ప్రమాణ స్వీకార సభకు తమను ఆహ్వానించలేదంటూ ఎంపీ వర్గం సోషల్ మీడియాలో వాపోయింది. ప్రస్తుతం జిల్లా మొత్తం మీద ఒక్క చిలకలూరిపేటలోనే అధికార పార్టీలో ఆధిపత్య రాజకీయాలు నడుస్తున్నాయి.

# వ్యవసాయ సమస్యలపై సమావేశం

ముమ్మిడివరం డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన కాట్రేనికోన మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ రైతు భరోసా కేంద్రాల చైర్మన్ నాటి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ముమ్మిడివరం శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ, వ్యవసాయ సలహామండలి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రతినెలా జరుగుతోంది. ఈ సమావేశాలకు మండల స్థాయి అభ్యుదయ రైతులు అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొని మండలంలోని వ్యవసాయ సమస్యలు ఈ సమావేశంలో చర్చించి తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించిన జరుగుతుందని, ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, కమిటీలో ఉన్న రైతులుక్రమం తప్పకుండా హాజరై వ్యవసాయ సమస్యలు పరిష్కరించాలని తెలియజేశారరు, అలాగే ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారి,కె.వెంకటేశ్వరరావు వ్యవసాయ శాఖలో అమలవుతున్న ఎన్నో పథకాలు గురించి రైతులకు తెలియజేశారు అనంతరం స్థానిక శాసన సభ్యులు పొన్నాడ సతీష్ కుమార్ చేతులమీదుగా, సి.హెచ్.సి గ్రూపు సభ్యులకు 40 లక్షల 15 వేల 500 రూపాయలు విలువ చేసే 32 రకాల యంత్ర పరికరాలను సభ్యులకు అందజేశారు. బ్యాంక్ లోన్ 20 లక్షల 6 వేల 750 రూపాయలు. ప్రభుత్వ సబ్సిడీ 16 లక్షల 5 వేల 400 రూపాయలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మండలం అధ్యక్షులు పాలెపు లక్ష్మి ధర్మారావు, వైస్ ఎంపీపీ, శ్రీమతి ఏడిద అరుణ సుబ్బారావు, నియోజకవర్గ ఆక్వా అభ్యుదయ రైతు నడింపల్లి సూర్యనారాయణ రాజు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి భూలక్ష్మి చిట్టిబాబు, మండల వైయస్ఆర్ పార్టీ నాయకులు నల్ల నరసింహ మూర్తి సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, డి సి సి బి కాట్రేనికోన మనోహర్, ఎంపీటీసీలు సర్పంచులు రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# ఆ గ్రామంలో పది రోజులు ఇతరులకు ప్రవేశం వుండదు

శ్రీకాకుళండిసెంబర్ 11, (న్యూస్ పల్స్) శ్రీకాకుళం జిల్లా ఆకాంక్షిస్తూ సీతంపేట మండలం జరడుకాలనీ గ్రామస్తులు గ్రామదేవత పండగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ గిరిజన గ్రామంలో ఆ పదిరోజులూ ఇతర గ్రామస్తులు గ్రామంలోకి రాకూడదని నిబంధన పెట్టారు. మొదటి రోజున గ్రామ శివారున సందెమ్మ కు రెండు రోజున గ్రామ అమ్మవారుకు మూడో రోజున గ్రామపితృదేవతలకు మొక్కులు తీరుస్తారు. దీనిలో భాగంగా బుధవారం యజ్జరోడు, దీసరోడు, జన్నోడులు వారి భాషలో ప్రత్యేక మంత్రాలు చదువుతూ పూజలు చేస్తారు. ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆచార సాంప్రదాయాలను కాపాడుకుంటూ పూజలు చేస్తున్నామని, అందరూ సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.పక్క గ్రామమైన సుందరయ్య గూడ గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల అందరూ అనుకొని ముందే సామానులు తెచ్చుకొని, పక్క గ్రామాల వారికి సమాచారమిచ్చి, పండగ జరిగే రోజుల్లో ఎవరిని గ్రామానికి రాకూడదని చెబుతారు. ఎవరికైనా చిన్న చిన్న వ్యాధులకు సంబంధించి ముందుగానే మందులు సిద్ధంగా ఉంచి, పెద్ద వ్యాదులకు డాక్టర్లని పిలిపించి బయట నుంచి మందులు అందిఅటామన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామంలోకి ఎలాంటి దిష్టిగాని,భూతాలుగాని రాకుండా గ్రామాన్ని రక్షిస్తుందని నమ్మకమన్నారు. అలాగే ఈ పది రోజులకు వివిధ మూలికలతో మందుల తయారుచేసి అమ్మవారి ముందు ఉంచి ఆ మందును వాడుకుంటామన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామంలోకి ఎటువంటి వ్యాధులు రావని మా విశ్వాసం అంటూ గిరిజన గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.

# రాయలసీమ అభివృద్ధి, హక్కులకోసం ధర్మదీక్ష

నంద్యాల రాయలసీమ హక్కుల కోసం డిసెంబరు13 న రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక ఆద్వర్యంలో విజయవాడ లో జరిగే రాయలసీమ ధర్మపోరాట దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక కన్వీనర్ బొజ్జా దశరథరామిరెడ్డి రాయలసీమ ప్రజలకు పిలుపునిచ్చారు.శనివారం నాడు నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. కర్నూలు లో హైకోర్టు ఏర్పాటు, క్రిష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయాలనీ, హంద్రీ–నీవా, గాలేరు – నగరి, తెలుగుగంగ, వెలిగొండ, ముచ్చుమర్రి, గురురాఘవేంద్ర, సిద్దాపురం ఎత్తిపోతల పథకాలను అనుమతించిన ప్రాజెక్టులుగా కృష్ణా నది యాజమాన్యం బోర్డు నోటిఫికేషన్ లో సవరణలు చేపట్టాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ నెల 13 న విజయవాడ నగరము నందలి ధర్నా చౌక్ లో రాయలసీమ ధర్మ దీక్షను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ ధర్మ దీక్ష లో రాయలసీమలోని అన్ని ప్రజా సంఘాలు పాల్గొననున్నట్లు దశరథరామిరెడ్డి ప్రకటించారు.. రాయలసీమ హక్కుల కోసం జరిగే ఈ ధర్మ దీక్షకు సంఘీభావం తెలియచేయాలని కోరుతూ వై.యస్.ఆర్.సి.పి., తెలుగుదేశం, కాంగ్రెస్, బి.జె.పి.,జనసేన, పార్టీల అధ్యక్షులకు మరియు సిపిఎం. సీపీఐ , న్యూ డెమొక్రసి పార్టీల ప్రధాన కార్యదర్శులకు లేఖలు వ్రాసి రాయలసీమ ధర్మ దీక్షలో పాల్గొనవలసినదిగా ఆహ్వానించడమైనదని ఆయన అన్నారు. మన మనుగడ కోసం, మన భావితరాల కోసం జరిగే ఈ రాయలసీమ ధర్మ దీక్ష లో రాయలసీమ అభిమానులు, రైతులు ఈ ధర్మ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు.అనంతరం వై.యన్.రెడ్డి, గోస్పాడు మండల రైతు నాయకులు బెక్కం రామసుబ్బారెడ్డి, చిన్న రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వరనాయుడు, .రమణారెడ్డి లతో కలిసి రాయలసీమ ధర్మ దీక్షకు సంబంధించిన కరపత్రాలను రైతు ప్రతినిధులు విడుదల చేసారు.

# పీఏలు చక్రం తిప్పేస్తున్నారు...

తిరుపతి, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)దీపం ఉండగానే ఇల్లు సక్కదిద్దుకోవాలి అనే సామెతను.. పీఏ పదవి ఉండగానే.. ఆస్తులు వెనకేసుకోవాలి అన్నట్లు మార్చారట చంద్రగిరి ఎమ్మెల్యే పీఏలు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాక.. చెవిరెడ్డి భాస్కర రెడ్డికి బాధ్యతలు కూడా పెరిగాయి. ప్రభుత్వ విప్ గా.. టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఉన్నారు. అలాగే వేరే పదవులు కూడా ఉన్నాయి. దీంతో.. ఆయనపై వర్క్ ప్రెజర్ పెరిగింది. మామూలుగా అయితే.. ప్రజలకి రెస్పాండ్ కావడం.. వారి పనులు చూడడం అనే విషయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చాలా ముందుంటారు. ఇప్పుడు బిజీ కావడంతో ఆరుగురు పీఏలను పెట్టుకుని.. ఆరు మండలాలకు ఇంచార్జ్ లుగా చేసి పనులు చూసుకోమన్నారట.ఇక పార్టీ కేడర్ కి కూడా వాళ్లనే కలవండి అని చెప్పారట. ఇంకేముంది.. లీడర్లు కూడా పీఏలనే కలవాల్సి వచ్చింది. వీరిలో ఓ పీఏ మాత్రం చాలా స్పీడ్ అంట. పనులు చేయించడంతో పాటు.. పైకం తీసుకోవడంలో కూడా సారువారి హ్యాండ్ సూపర్ స్పీడ్ అట. ఎమ్మెల్యే పేరు చెప్పి పనులు చేయించుకోవడం.. కమిషన్ తీసుకోవడం సూపర్ గా నడుస్తోందంట. ఇది చూసిన మిగతా పీఏ లు కూడా దుకాణాలు ఓపెన్ చేసి.. పనికి ఇంత అంటూ రేట్ కట్టేసి.. ఫుల్లుగా వెనకేసుకుంటున్నారట.అంతే ఇక. లీడర్లు కూడా పీఏలనే బాస్ లుగా చూడాల్సిన పరిస్థితి. మామూలుగా లోకల్ లీడర్లు కూడా చాలా బలంగా ఉంటారు. డబ్బులు.. పొలాలు ఆస్తులు ఈ విషయాల్లో మంచి పవర్ ఉంటుంది. కానీ.. వాళ్లు కూడా పీఏలతో కలవక తప్పడం లేదట. ఇంకేముంది చెప్పండి. పీఏలపై లోకల్ లీడర్లు చాలా సీరియస్ గా ఉన్నారట. ఏందిరా నాయనా ఈ పీఏల పెత్తనం అని.. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దగ్గరికి తీసుకెళ్లినా ఎలాంటి ఉపయోగం లేదట. ఇక పెద్దలకి కూడా చెబుతున్నారట. ఈ పీఏలే ఎమ్మెల్యేల కంటే ఎక్కువ చేస్తున్నారు అని.. కక్కలేక మింగలేక చస్తున్నారట లోకల్ లీడర్లు.


# విజయనగరంలో రెండుగా టీడీపీ



విజయనగరం, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)విజయనగరం టీడీపీలో పాలిటిక్స్ మొదలయ్యాయి. రెండు వర్గాలుగా చీలి పోతున్నారు లీడర్లు. అశోక్ గజపతి రాజు.. మీసాల గీతల వర్గాలుగా విడిపోతున్నారు. రీసెంట్ గా మీసాల గీత పార్టీ కార్యాలయం ఓపెన్ చేయడంతో ఈ ఎవ్వారం మరోసారి తెరపైకి వచ్చింది.మామూలుగా విజయనగరం జిల్లాలో టీడీపీకి పెద్ద దిక్కు అంటే అశోక్ గజపతి రాజు అనే విషయం అందరికీ తెలిసిందే. ఇంతకు ముందు కూడా అశోక్ గజపతి రాజు.. మీసాల గీత కలిసి కట్టుగానే పని చేశారు. ఇద్దరూ ఒకే చోట పోటీ చేసి.. ఎంపీగా గజపతి రాజు.. ఎమ్మెల్యేగా మీసాల గీత గెలిచారు. కానీ.. పోయిన ఎన్నికల్లో మీసాల గీతకు కాకుండా.. తన కుమార్తె.. అదితి కి ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించారు అశోక్ గజపతి రాజు. అప్పటి నుంచి వీళ్లిద్దరికీ ప్రాబ్లమ్ వచ్చింది. పార్టీ ఆఫీస్ కూడా అశోక్ గజపతి రాజు ఇల్లే అన్నట్లుగా ఉండేది. అందుకే.. తనకి ఇంపార్టెన్స్ ఉండడం లేదని.. ఇన్ఫర్మేషన్ కూడా అందడం లేదని.. మీసాల గీత పార్టీ ఆఫీస్ ఓపెన్ చేశారు. ఆ పార్టీలోని కొందరు లీడర్లు.. ఈ ఆఫీస్ ఓపెనింగ్ కి వచ్చారు. జిల్లాలో పార్టీ కార్యాలయం లేక పోవడం వల్ల.. పార్టీ ఉనికి పోతుంది అనే భావనతోనే పార్టీ ఆఫీస్ ఓపెన్ చేశాం అన్నారు మీసాల గీత.కానీ.. ఇంటర్నల్ గా మాత్రం పాలిటిక్స్ వేరే వేరే ఉన్నయ్. లోకల్ బాడీ ఎన్నికల విషయంలో కూడా అశోక్ గజపతి రాజు.. మీసాల గీతపై చాలా ఆరోపణలు చేస్తున్నారట. ఇండైరెక్ట్ గా వైసీపీకి సపోర్ట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారట. ఇలాంటి మాటల వల్లే తాను పార్టీ ఆఫీస్ ఓపెన్ చేయాల్సి వచ్చిందని.. మాజీ ఎమ్మెల్యే మీసాల గీత చెప్పుకుంటున్నారట. ఆమె వర్గం కూడా ఇదే మాట చెబుతోందంట. అసలే పార్టీ కష్టాల్లో ఉంటే.. వీళ్లిలా రెండు వర్గాలుగా చీలితో ఎలా అంటున్నారు టీడీపీ సీనియర్లు. మరి ఈ వివాదాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రమే క్లియర్ చేయగలరని మాట్లాడుకుంటున్నారు.

# తగ్గిపోతున్న పంచదార

విజయవాడ, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల్లో చక్కెర అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా కార్డులకు సరిపడ రేషన్ పంచదార సరఫరా చేయడంలో పౌరసరఫరాల సంస్థ విఫలమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,44,93,187 కార్డుల్లో అంత్యోదయ అన్న యోజన కార్డులు 7,79,168 ఉన్నాయి. వీటికి ఒక్కో కార్డుకు కేజీ చొప్పున, మిగిలిన 1,37,14,019 కార్డులకు అరకేజీ చొప్పున పంచదార ఇవ్వాలి. మొత్తం కార్డులన్నింటికీ పంచదార ఇవ్వాలంటే నెలకు నెలకు 8వేల మెట్రిక్ టన్నుల పంచదారను ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంటుంది. నెలకు 75.83లక్షల పంచదార ప్యాకెట్లు సరఫరా కావాల్సింది కేవల 66.91లక్షల ప్యాకెట్లు మాత్రమే సరఫరా అయ్యాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దాదాపు 9 లక్షల ప్యాకెట్లు సరఫరా కాలేదు. ఒక్క నెలలోనే ఈ విధంగా ఉంటే గడిచిన మూడు నెలల్లోనూ ఇదే తరహాలో ప్యాకెట్ల సరఫరా జరిగిందని డీలర్లు, ఎండియు డ్రైవర్లు చెబుతున్నారు. పంచదార అందని ప్రజలు తమను దోషులను చేసి నిందిస్తున్నారని, సమాధానం చెప్పుకోలేకపో తున్నామని డీలర్లు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత మూడు నెలల్లో సరఫరా అయిన పంచదారలో నాణ్యత ఏమాత్రం బాగోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.కార్డులకు సరిపడినంత పంచదార సరఫరా చేసేందుకు గోడోన్లలో సరిపడినంత నిల్వలు లేవని అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ నుండి సరిపడినంత పంచదార రావడంలేదు. రెండో విడత రేషన్ పంపిణీ తాలూకు కమిషన్లను ఇవ్వడం లేదు. డిసెంబర్‌లో అసలు పంచదార రాలేదు.రెండు నెలలుగా కార్డులన్నింటికీ సరిపడినంత పంచదార రావడంలేదు. అక్టోబర్‌లో సగం ఇచ్చారు. నవంబర్‌లో సగంలో సగం ఇచ్చారు. డిసెంబర్‌లో అసలు ఇవ్వలేదు. ప్రజల నుండి మాపై ఒత్తిడి పెరుగుతోంది.



## రౌడీ షీటర్ కు దేహశుద్ది

విజయవాడ డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)చెడ్డీ గ్యాంగ్ పేరు ఇప్పుడు విజయవాడలో హడలెత్తిస్తోంది. స్థానిక ప్రజలు అనుమానితులపై దాడులకు దిగుతున్నారు. ఇదే కోవలో నున్నలో రౌడీ షీటర్ ఏబేలు పై స్థానికులు దాడి చేసారు. అంతకుముందు పాల ఫ్యాక్టరీ సమీపంలో ఏబేలు కూలీల నుంచి డబ్బు లాక్కున్నాడు. పారిపోతున్నల ఏబేలు ను స్థానికులు, కూలీలు వెంబడించారు. బైక్ మీద పారిపోయే క్రమంలో అతడు కింద పడిపోయాడు. స్థానికుల నుంచి తప్పించుకునేందుకు నున్న సమీపంలోని చెరువులో దూకేసాడు. ఏబేలుని చెడ్డీ గ్యాంగ్ కు చెందిన వాడిగా భావించి దాడి చేసిన స్థానికులు, చెరువులోంచి లాక్కొచ్చి చితకబాదారు. కాళ్లూ, చేతులను వైర్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు.

## పలమనేరు ఆర్టీవో చెక్ పోస్టులో ఏసీబీ తనిఖీలు

చిత్తూరుడిసెంబర్ 11, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా పలమనేరు ఆర్టీవో చెక్ పోస్ట్ లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలమనేరు చెక్పోస్ట్ నందు నిత్యం అధికారులు అక్రమ వసూళ్లు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి నుండి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నారు. పలమనేరు ఇటు తమిళనాడు అటు కర్ణాటక రాష్ట్ర సరిహద్దు కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహన రాకపోకలు జరుగుతుంటాయి. ఆర్టీవో అధికారుల చేతి వాటం చూపెడుతుండంతో పలువురు వాహన చోదకులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు చెయ్యడంతో రాత్రి నుండి చెక్ పోస్ట్ లో సోదాలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము వరకు సోదాలు జరిగాయి. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## ఆరుగురు వేద పాఠశాల విద్యార్థుల మృతి పట్ల గవర్నర్‌గ్భ్రాంతి

విజయవాడ, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లాలో చోటు చేసుకున్న విషాద సంఘటన పట్ల ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌గ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శ్వేత శృంగాచలం వేద పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు అచ్చంపేట మండలంలోని మాదిపాడు సమీపంలో కృష్ణా నదిలో ఈతకు దిగి ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతి చెందటం విచారకరమన్నారు. మృతులు హర్షిత్ శుక్లా, శుభమ్ త్రివేది, అన్షుమన్ శుక్లా, శివ శర్మ, నితేష్కుమార్ దిక్షిత్గా గుర్తించగా వారి కుటుంబాలకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్నారుల భద్రత విషయంలో వివిధ సంస్థల యాజమాన్యాలు మరింత శ్రద్ధ తీసుకోవాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. ఈ మేరకు రాజ్ భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఈనెల 21 న సీఎం జగన్ తణుకు పర్యటన

ఏలూరుడిసెంబర్ 11, (న్యూస్ పల్స్) పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 21 న పర్యటన ఖారారయింది. ఆ రోజు లయన సంపూర్ణ గృహ హక్కు పథకం తణుకు నుండి ప్రారంభిస్తారు. శనివారం నాడు సీఎం సభ ఏర్పాట్లును జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ తదితరులు పరిశీలించారు. రాష్ట్రంలో 52 లక్షల మందికి సంపూర్ణ గృహ హక్కు పథకం అమలు చేయనున్నారు. బహిరంగ సభను తణుకు చిట్టూరి ఇంద్రయ్య కళాశాలలో ఏర్పాటు చేస్తున్నారు.

## వేద విద్యార్థులు చనిపోవడం కలచివేసింది

అమరావతి డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)కృష్ణా నదిలో ఈతకు వెళ్లిన వేద విద్యార్థుల మృతి బాధాకరమని టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అన్నారు. మృతుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఎంతో భవిష్యత్ ఉన్న వేద విద్యార్థులు చనిపోవడం కలచివేసిందన్నారు. నదీ సమీపంలో వేద పాఠశాల ఉన్నందున విద్యార్థుల భద్రత పట్ల యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు.

## జగన్ హత్యకు కుట్ర- రాప్తాడు ఎమ్మెల్యే

అనంతపురం, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)నంతపురం జిల్లా రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని హత్యకు కుట్ర జరుగుతోందని.. టీడీపీ నేతలు ఈ కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనను హత్యచేసైనా అధికారంలోకి రావాలని టీడీపీ భావిస్తోందన్నారు. జగన్ గాల్లోనే కలిసిపోతారంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారని.. సీఎంను జైలుకు పంపేందుకు టీడీపీ కుట్ర పన్నుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అనంతపురం జిల్లా మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి.'మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యేలు వంశీ, అంబటిలను చంపితే రూ.50 లక్షలు ఇస్తానని కమ్మ సంఘం నేత మల్లాది వాసు అంటున్నారు. ఎక్కడో చెబితే అనంతపురంలో ఫ్లెక్సీలు కడుతున్నారు. ఇదే టీడీపీ విధానమా? అలా కాకపోతే టీడీపీ అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహా టీడీపీ నేతలెవరూ మల్లాది వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదు? హింసా రాజకీయాలకు కేరాఫ్‌గా టీడీపీ, స్కాంలకు కేరాఫ్‌గా చంద్రబాబు మారారు. చంద్రబాబు పాలనలో వేల కోట్ల ప్రజాధనం టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లిపోయింది. ఇది అబద్ధమైతే సీఐడీ విచారణకు ఆ పార్టీనేతలు ఎందుకు అడ్డుపడుతున్నారో వివరించాలి. జగన్ ను హత్య చేసైనా అధికారంలోకి చేజిక్కించుకోవాలని టీడీపీ చూస్తోంది.' అని ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు.

## అంజనా హాస్పిటల్ ప్రారంభోత్సవము

కడప డిసెంబర్ 11 మా హాస్పటలనందు బీపీ, షుగర్, జాండీస్, టీబి, విష జ్వరాలు వంటి సాధారణ వ్యాధులకు మెరుగైన చికిత్సలు అందిస్తామని డాక్టర్ కె.వి తనూజ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని పాలెంపాపయ్య వీధి లో అంజనా హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో డాక్టర్ తానూజ్ కుమార్ మాట్లాడుతూ పక్షపాతం, తేలు పాము కాటుకు చికిత్సలు అందిస్తామన్నారు. కోవిడ్, ఎయిడ్స్ వ్యాధికి వైద్యం చేస్తామన్నారు. గుండె జబ్బులు, మెదడు వాపులు, ఊబకాయం వంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మనాభరెడ్డి, బంధుమిత్రులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన చేయకపోతే ఎంపీలను - కేంద్రమంత్రులను గేరావ్ చేస్తాం

హైదరాబాద్ డిసెంబర్ 11 జనాభా గణనలో కుల గణన చేపట్టాలని, పార్లమెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో బిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక హెచ్చరించారు. మూడు రోజుల ఢిల్లీ ఉద్యమాలను ముగించుకుని నేడు హైదరాబాద్ కు చేరుకున్నారు. డిల్లీలో వందలాది మందితో పార్లమెంటు ముట్టడి, మహాధర్నా జరిపారు, జాతీయ స్థాయి అఖిలపక్ష సమావేశానికి కేంద్ర మంత్రి మరియు 18 మంది ఎంపీలు అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశాలు జరిపారు. 92 మంది పార్లమెంటు సభ్యులను, 16 మంది కేంద్ర మంత్రులను బీసీ నాయకులు కలిసి బీసీలకు రాజ్యాంగపరమైన హక్కులు కల్పించాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్ లో పోరాటం చేయాలని ఎంపీలను కోరడం జరిగింది. బీసీల డిమాండ్లను పరిష్కరించకపోతే పార్లమెంటు సభ్యులను, కేంద్ర మంత్రుల గేరావ్ చేస్తామని హెచ్చరించారు. శనివారం కచిగుడలో మీడియా సమావేశం లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ,బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రం కోటి,బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెల వెంకటేష్ లతో కలిసి మాట్లాడారు.జనాభా గణనలో కుల గణన ప్రజలకు కాదు - కేంద్ర ?రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం కల్పించిన సదుపాయాల కోసం అవసరం. కుల గణనతో ఒక్కొక్క కులం జనాభా హో పాటు సాంఘీక, ఆర్థిక, రాజకీయ వివరాలు సేకరించి అన్ని కులాలకు సామాజిక న్యాయం జరుగుతుంది. వారి వారి కులాలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు లబిస్తాయి. జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయించి వారి ఆర్థికాభివృద్ధి కి చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది, బి.సి కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి ఒకే రకమైన సారుప్యత కలిగిన వారిని గుర్తించి గ్రూపులుగా వర్గీకరించి ప్రత్యేక అభివృద్ధి చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ప్రభుత్వాలకు అభివృద్ధి-సంక్షేమ పథకాలకు, రిజర్వేషన్ల అమలుకు అవసరం. ఒకసారి కులాల వారి జనాభా గణన చేస్తే గత 74 సంవత్సరాల స్వతంత్ర భారతదేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ ముఖచిత్రం బయటకు వస్తుంది. ఎన్ని కులాలు ఉన్నాయి. ఎన్ని అంతరించాయి. అలాగే భారత స్వాతంత్ర ఫలాలు, ప్రజాస్వామ్య ఫలాలు ఏయే కులాలు ఎంత శాతం పొందుతున్నారని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. అనంతరం గుజ్జ కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత

**కేంద్రం స్పందించకుంటే జాతీయస్థాయిలో ఉద్యమం ఉధృతం**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**

దేశంలోని పారిశ్రామిక, ఆర్థిక, రాజకీయ ఫలాలు ఏ కులాలకు దక్కాయి. ఇంత వరకు అభివృద్ధి ఫలాలకు నోచుకోని కులాలకు వారి, వారి వాటా కేటాయింపులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ప్రణాళిక రూపకల్పన చేయడానికి వీలవుతుంది. స్వాతంత్ర్య భారతంలో బి.సి లకు రాజకీయంగా కనిస ప్రాతినిధ్యం లభించడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణాంకాల ప్రకారం గత 74 సంవత్సరాల గణాంకాలు పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, కేంద్ర-రాష్ట్ర మంత్రులు వివరాలు సేకరిస్తే బి.సి ల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదు. గత 74 సంవత్సరాల ప్రజాస్వామ్యంలో 56 శాతం జనాభా గల బి.సి లకు 14 శాతం ప్రాతినిధ్యం దాటలేదంటే రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలిసిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. అంతేకాదు. 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాల నుండి ఒక పార్లమెంట్ సభ్యులు లేరు. ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ కనిపిస్తుందని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా? ధనస్వామ్యమా? అని ప్రశ్నించారు. నెల వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణా లో 119 యం.యల్.ఏ. లు

ఉంటే బి.సి లు కేవలం 21 మంది మాత్రమె ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 175 మంది ఓఎం లు ఉండగా బిసి లు కేవలం 36 మంది మాత్రమే ఉన్నారు. ఇంత తక్కువ ప్రాతినిధ్యం చూస్తే ఇదెలా ప్రజాస్వామ్యమవుతుంది. 56 శాతం జనాభా గల బి.సి లకు ప్రాతినిధ్యం ఏదని ప్రశ్నించారు. బి.సి లు ఓట్లు వేయడానికేనా అని ప్రశ్నించారు. రాంకోటి మాట్లాడుతూ బి.సి లకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలసిన ఆవశ్యకతను సమర్పించారు. ఈ దేశంలోని 2600 బి.సి కులాలలో 2550 బి.సి కులాల వారు పార్లమెంట్ లో అడుగు పెట్టలేదు. ఈ కులాలకు ఎన్నికలలో పోటీ చేసే ఆర్థిక స్తోమత లేదు. జనాభా తక్కువగా ఉన్న కులాలను పట్టించుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులలో ఈ కులాలకు చట్ట సభలలో ప్రవేశం సాధ్యం కావడం లేదు. ఈ దేశంలో పుట్టి ఈ దేశ సంపద సృష్టించిన కుల వృత్తుల వారికి కూడా ఆంగ్లో-ఇండియన్ లాగా నామినేటెడ్ పద్ధతిపై చట్ట సభలకు పంపాలని డిమాండ్ చేస్తున్నాము.ఈ సమావేశంలో ఉ.కృష్ణ యాదవ్, జిల్లపల్లి అంజి, పగిళ్ళ సతీష్, చరణ్ యాదవ్, సుచిత్ కుమార్, పాల్గొన్నారు.

## 12 మంది 'ఎర్ర స్మగ్లర్ల అరెస్టు

చిత్తూరు డిసెంబర్ 11 ఎర్రచందన దుంగలను స్మగ్లింగ్ చేస్తున్న 12 మందితో కూడిన అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.24లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలను సీజ్ చేశారు. వివరాలను శుక్రవారం చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డితో కలిసి డీఎస్పీ సుధాకర్రెడ్డి మీడియాకు తెలియజేశారు. చిత్తూరు వైపు నుంచి వేలూరుకు ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నారంటూ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దాంతో గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందతో కలిసి గొల్లమడుగు చెక్పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు కార్లలో అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడుకు చెందిన నందకృష్ణన్, మునస్వామి, కార్తికేయన్, మురుగన్, రామకృష్ణన్, రంగస్వామి, పూవరసన్లను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంలో గుడిపాల సమీపంలోని ఎంసీఆర్ కళాశాల వద్ద ఓ వ్యానును తనిఖీ చేయగా.. 11 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వ్యానులోని తమిళనాడుకు చెందిన సత్యరాజ్, కుప్పస్వామి, ఏలుమలై, గోవిందన్, తిరుపతిలను అదుపులోకి తీసుకున్నారు స్మగ్లర్లను రిమాండ్కు తరలించారు.

## జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం".. ఓ సువర్ణావకాశం !

కడప, డిసెంబర్ 11 : "జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం" గృహ లబ్దిదారులకు ఓ సువర్ణ అవకాశాన్ని కల్పిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో.. పథకం అమలు ప్రక్రియ సమర్థవంతంగా జరగాలని.. జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) ధ్యానచంద్ర సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని శ్రీరాములపేటలో వార్డు సచివాలయం-4 ను జేసీ (హౌసింగ్) ధ్యానచంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. "జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం" కు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహణను.. ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా.. జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంపై సచివాలయం సిబ్బందికి జేసీ తగు సూచనలు, సలహాలు ఇస్తూ.. పథకం అమలు సమర్థవంతంగా జరగాలని ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా గృహంపై రుణం తీసుకొని గృహం నిర్మించుకొన్న లబ్దిదారులు గాని, వారి వారసులు గాని లేదా ప్రస్తుతం ఇంటిని అనుభవిస్తున్న వారు గాని

**జేసీ (హౌసింగ్) ధ్యానచంద్ర**

**ఎర్రగుంట్ల-4 వార్డు సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ**

జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం ద్వారా ఋణ విముక్తిని పొంది.. గృహంపై పూర్తి హక్కులు పొందవచ్చనే విషయాన్ని.. లబ్దిదారులకు స్పష్టంగా అర్థమయ్యేలా..

సచివాలయ సిబ్బంది వివరించాలన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనితీరును ఆయన పరిశీలించారు. ఋణ విముక్తి కి అర్హత గల వారికి.. ఈ పథకం సువర్ణావకాశం కల్పిస్తుందని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ.. ఈ పథకాన్ని సద్వినియోగించుకునేలా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి జేసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది, స్థానిక మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మరింత ఆలస్యం కానున్న మెట్రో ప్రాజెక్టు

హైదరాబాద్, డిసెంబర్ 11, (న్యూస్ పల్స్)రాయదుర్గం? శంషాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో కారిడార్ ప్రాజెక్టు నిర్మాణం మరింత ఆలస్యం కానుంది. 2019లోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రకటించినా కానీ సరిపడా నిధుల్లేక పనులు ముందుకు సాగట్లేదు. రాయదుర్గం? శంషాబాద్ ఎయిర్?పోర్టు వరకు ఎక్స్ ప్రెస్ మెట్రో కారిడార్ నిర్మాణానికి రూ. 4 వేల 500 కోట్లతో మెట్రో సంస్థ వద్ద ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. కానీ నిధుల కేటాయింపులు, చెల్లింపులు లేకపోవడంతో ఇప్పటికీ భూ సేకరణ పూర్తి కాలేదు. దీంతో ఎయిర్ పోర్టుకు జర్నీ చేసేందుకు మెట్రో ట్రైన్ సౌలతు ఇప్పట్లో వచ్చేలా లేదు. ప్రాజెక్టు పూర్తయితే 40 నిమిషాల జర్నీ... 20 నిమిషాలకు తగ్గనుంది. సెకండ్ ఫేజ్ మెట్రో విస్తరణ పనుల్లో భాగంగా ఎయిర్ పోర్టుకు వేగంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు 30 కి.మీ ఎక్స్ ప్రెస్ మెట్రో కారిడార్? ప్రాజెక్టుకు ప్రభుత్వం గతంలోనే ప్రతిపాదనలు చేసింది. ఎయిర్ పోర్టు కారిడార్ కోసం స్పెషల్ వింగ్?ను ఏర్పాటు చేసిందే తప్ప సరిపడా నిధులు ఇవ్వలేదు. దీంతో భూ సేకరణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. సిటిజన్లు ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సులు, క్యాబ్ ల్లో ఎయిర్ పోర్టుకు అత్యవసరంగా వెళ్లాలంటే రెండు, మూడు గంటల ముందు నుంచే ప్లాన్ చేసుకోవాల్సిన పరిస్థితి. ఎయిర్?పోర్టు వరకు మెట్రో విస్తరణ ప్రాజెక్టు పూర్తయితే సిటీ రవాణాలోనే అది కీలకం కానుంది. తగ్గిన మెట్రో రెవెన్యూ, ప్రభుత్వ నిధులు కేటాయింపులు లేక రాయదుర్గం? శంషాబాద్ ప్రాజెక్టు అనుకున్నంత వేగంగా అందుబాటు లోకి వచ్చేలా లేదు. 30?32 కి.మీ పొడవైన ఎయిర్ పోర్టు ఎక్స్ ప్రెస్ మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఢిల్లీ మెట్రో అధికారులు ఏడాది క్రితం రాయదుర్గం? శంషాబాద్ రూట్ లో పర్యటించి ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను రూపొందించి హైదరాబాద్ మెట్రో అధికారులకు అందించారు. ఉండటంతో భూ సేకరణలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం హెచ్ఎండీఏ, మెట్రో, టీఎస్ఐఐసీని భాగస్వామ్యం చేస్తూ స్పెషల్ పర్పస్ వెహికల్ కోసం ప్రత్యేక వింగ్?ను కూడా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ నుంచి రూ. 350 కోట్లు నిధులు ఇవ్వాలంటూ గతంలో మంత్రి కేటీఆర్ ఆదేశించారు. కానీ భారీ అంచనాలతో రూపొందించిన ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు సమకూరితే గానీ పనులు మొదలు కావని మెట్రో వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటికే ఫండింగ్ ఏజెన్సీలతో స్పెషల్ వింగ్ ఆధ్వర్యంలో చర్చలు జరిగినా... ఫలితం లేదని తెలిసింది. ఈ క్రమంలో ప్రభుత్వం కేటాయించే నిధులవే మెజార్టీ వాటా కానుంది. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్ల నిధులు కూడా మంజూరు కాలేదని సమాచారం. ఐటీ కారిడార్ నుంచి ఎయిర్ పోర్టు రూట్?లో రియల్ ఎస్టేట్?కు ఫుల్ డిమాండ్ ఉంది. ఇప్పటికే లగ్జరీ విల్లాలు, వేల మంది ఉండే అపార్టుమెంట్లకు దీటుగా హైరైజ్ బిల్డింగ్?లు ఆయా ప్రాంతాల్లో భారీగా వస్తున్నాయి. ఈ క్రమంలో రాయదుర్గంతో ఆగిపోయిన మెట్రో లైన్?ను విస్తరణ పూర్తయితే.. రవాణా సౌలతులు మరింత మెరుగుపడతాయి. ఈ మెట్రో ప్రాజెక్టు రూట్?లో ఓఆర్ఆర్ కు సమీపంలోని గచ్చిబౌలి, అప్పా జంక్షన్, కిస్మత్‌పురా మీదుగా శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు రద్దీ పెరగనుంది.

## సాయి తేజ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రులు

చిత్తూరు డిసెంబర్ 11 వీర సైనికుడు సాయి తేజ అందించిన సేవలు మరువలేనివని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని చెప్పారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి అన్నారు. శనివారం ఉదయం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మరియు మైనింగ్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం .హరినారాయణన్ ల తో కలసి కురబలకోట మండలం రేగడపల్లి లో సాయి తేజ కుటుంబ సభ్యులను పరామర్శించారు.సాయితేజ చిత్ర పటానికి నివాళి అర్పించారు .ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు.దేశ రక్షణరంగంలో విశిష్టమైన సేవలను సాయి తేజ అందించారని వారి సేవలను ఎన్నటికి మరవలేమని ,విలువ కట్టలేనివని ఆయన సతీమణి శ్యామల,ఆయనపిల్లలను,తల్లితండ్రులను దేశ సేవలో ఉంటున్న సాయి తేజ సోదరుడు మహేష్ లను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున వారి కుటుంబానికి యాభై లక్షల రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారు వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పడం జరిగిందని, సాయి తేజ సతీమణి కి ఉద్యోగం కావాలని కోరడం జరిగిందని దీనికి సంబంధించి ముఖ్యమంత్రికి సమాచారం అందిస్తామని తెలిపారు.

## అక్కంపల్లిలో చైన్ స్నాచింగ్

వలిగొండ ద్విచక్రవాహనంపై గ్రామంలోకి ప్రవేశించి ఇల్లు వాకిలి శుద్ధి చేసుతున్న మహిళ మెడలో నుంచి నాలుగు తులాల తాళిబొట్టు ను లాక్కెళ్లిన ఘటన జిల్లాలో కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన దేశిరెడ్డి కమలాకర్ రెడ్డి కల్యాణి దంపతులు అక్కంపల్లి గ్రామం లో నివసిస్తుంటారు.ఈ గ్రామం వలిగొండ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉంటుంది. ఈరోజు తెల్లవారుజామున కల్యాణి తన ఇంటి ముందు వాకిలి శుద్ధి చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఇక్కడ బోరు ఎక్కడ వేస్తున్నారని అడుగగా కల్యాణి నాకు తెలియదు అనటంతో ఈ దారి ఎటు వెళుతుంది అని అడ్రస్ అడిగినట్లుగా ఆమె దృష్టి మరల్చి ఆమె మెడలో నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు ను లాక్కెళ్లి వెళ్ళిపోయినట్లు తెలిసింది. అంతలో ఆమె వారిని వావరించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.దాంతో ఆ పుస్తెల తాడుతో చోధకులు ఉదయించారని ఆమె తెలిపింది.ఇంతలో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దొంగల కొరకు గాలిస్తున్నట్లు సమాచారం.పట్టణ కేంద్రానికి కూతవేటు దూరంలో ఈ చైన్ స్నాచింగ్ జరగటం ఇంట్లో ఉన్న మహిళలకు కూడా భద్రత లేకపోవడంతో అక్కడి ప్రజలు ఆంద్రోళన వ్యక్తం చేస్తున్నారు.ఆ గ్రామంలో యథేచ్ఛగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని వాటిని నిర్మిలించకపోవటం,పోలీసుల పెట్రోలింగ్ లాంటి లోపంతోనే ఈ దోపిడీ జరిగిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

## సేవా భారత్ అవార్డ్ అందుకున్న ఆడిటర్ పఠాన్ తౌహిద్ ఖాన్

**అవార్డు అందజేసిన ప్రపంచ మానవ హక్కుల సంఘం.**

కడప డిసెంబర్ 11:కడప నగరానికి చెందిన యువ ఆడిటర్ తౌహిద్ ఖాన్ సొంతంగా అబ్దుల్ కలామ్ సేవా సమితి అనే సేవా సంస్థను స్థాపించి గత 4 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అనేక సేవా కార్యక్రమాలకు గాను ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న అనేక రాష్ట్రాల వ్యక్తులకు నెల్లూరులో ఏర్పాటు చేసిన సేవా భారత్ అవార్డు కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల చైర్మన్ సుబ్బారెడ్డి గారి చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేసి అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నెల్లూరు మేయర్ అనురాధ గారు, రిటైర్డ్ జడ్జి మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆడిటర్ తౌహిద్ ఖాన్ గారు మాట్లాడుతూ సేవా భారత్ అవార్డ్ రావడం పట్ల చాల సంతోషంగా ఉందని, ఈ అవార్డును ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని, హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.

## ఈ నెల 12న జెడ్పి సర్వసభ్య సమావేశానికి సమగ్ర సమాచారంతో హాజరవ్వాలి

**జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి**

కడప, డిసెంబర్ 11 ఈ నెల 12న జరిగే జెడ్పి సర్వసభ్య సమావేశానికి.. జిల్లాలో అభివృద్ధికి సంబంధించి ప్రగతి నివేధికలతో పాటు.. అభివృద్ధి చేయాల్సిన అంశాల ప్రతిపాదనలకు సంబంధించి సమగ్ర సమాచారంతో అధికారులు, సభ్యులు హాజరు కావాలని జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి.. శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్తు పాలకవర్గం ఏర్పడిన తర్వాత.. గౌరవ జెడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగే మొట్టమొదటి సర్వసభ్య సమావేశాన్ని.. ఈ నెల 12న (ఆదివారం) ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జెడ్పి సమావేశ మందిరం నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున సభ్యులందరూ.. తమ గుర్తింపు కార్డులతో సమావేశానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశానికి జిల్లాపరిషత్ సభ్యులతో పాటు.. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, నీటిపారుదల, గ్రామీణ, పట్టణ అభివృద్ధి, నీటి యాజమాన్య సంస్థ, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థ, ఎస్సి,ఎస్టీ, బీసీ, మైనారిటీ సంకేమ శాఖలు, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య, విద్య, వ్యవసాయ అనుబంధ శాఖలు, ప్రణాళిక శాఖలు, అనుబంధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అధికారులు ఆయా శాఖల అభివృద్ధి సంబంధించిన ప్రగతి నివేదికలు, అభివృద్ధి చేయవలసిన అంశాలకు సంబంధించి సమగ్ర సమాచారం, ప్రతిపాదనలతో సమావేశానికి హాజరు కావాలని జెడ్పి సీఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## డ్వాక్రా పల్స్ సర్వే గడువును పెంచండి

కడప డిసెంబర్ 11కడపజిల్లాలోకొన్ని వేల ద్వాక్రా గ్రూప్ లు ఉంటే, ఒకటి రెండు రోజుల్లోనే పల్స్ సర్వే ఏవిధంగా పూర్తి చేయగలరని, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీమ్ అన్నారు.ఆర్పీపీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్వాక్రా మహిళల అందరికీ రుణమాఫీ పేరుతో వారినందరినీ కార్యాలయానికి పిలిపించుకుని పల్స్ సర్వే నిర్వహిస్తున్నారని వివరించారు. అయితే గడువు తక్కువ కావడం వల్ల వందల మంది క్యూలో నిల్చుని ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీనికితోడు సర్వర్ సాంకేతిక లోపాలవల్ల, కొద్ది మందికి మాత్రమే పల్స్ సర్వే ను నిర్వహిస్తున్నారని ఆమె8 తెలిపారు. మిగిలిన వారందరికీ మరొక దశలో చేస్తామని అధికారులు చెప్పడం మహిళల్లో ఆందోళన చెందుతున్నారని ఆమె8 తెలిపారు. కనుక అధికారులు దీనిని గమనించి మరికొంతకాలం గడువును పెంచి పల్స్ సర్వే చేసే విధానాన్ని, సి ఆర్ పి వారికి, మరి కొందరి అధికారుల ద్వారా సకాలంలో సర్వేని పూర్తి చేయగలరని ఆమె అభిప్రాయపడ్డారు. అలా కాకుండా ఏ కొద్ది మందికి మాత్రమే చేసి మిగిలిన వారిని వదిలి పెట్టడం తగదని ఆమె అన్నారు. అందరూ వివిధ రకాల పనులకు వెళ్తున్న తరుణంలో వాటన్నిటినీ వదిలి పెట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరగటం వల్ల, రుణమాఫీ మాట పక్కన పెడితే ఆటో చార్జీలకు కొత్త అప్పులు చేయాల్సి వస్తుందని ఆమె అన్నారు.కనుక సంబంధిత అధికారులు గడువును పెంచి అందరికీ పల్స్ సర్వే చేయించాలా తగు చర్యలు తీసుకోవాలని, రాయలసీమ మహిళా సంఘం డిమాండ్ చేస్తున్నదని అన్నారు.

# భారతి విద్యా సంస్థల పై విచారణ చేయండి




నంద్యాల డిసెంబర్ 11,( విభారె) :- నంద్యాల పట్టణంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు శనివారం నాడు పద్మావతి నగర్ యందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఏఐయస్ ఫ్. ఏఐవైఫ్. పిడియస్ యు. ఏఐయస్ ఏ. డివైఫ్ ఐ -బీసీ,ఎస్సి,ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య నేతల భారతీ విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. . ఒకే బిల్డింగ్ లో 5 కళాశాలలు నడుపుతు ప్రభుత్వం చెవులో పూలు పెడుతున్న భారతి విద్యాసంస్థల అధినేత నాగేశ్వరరావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. నాకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి,నాకెందుకు ప్రభుత్వ నిబంధనలు నాకిష్టమొచ్చినట్టు నేను విద్యాసంస్థలను నడుపుకుంటాను.అని ప్రగల్భాలు పలుకుతున్న భారతి విద్యాసంస్థల అధినేత నాగేశ్వరరావు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆర్ ఐ ఓ , రాయలసీమ యూనివర్సిటీ అధికారులు,ఐటిఐ కళాశాలల జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించి భారతి విద్యాసంస్థల నుండి విద్యార్థులను కాపాడాలని కోరారు. ఏఐయస్ ఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు,పిడియస్ యు . జిల్లా సహాయ కార్యదర్శి రఫీ,బీసీ,ఎస్సి,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, డివైఫ్ ఐ. నంద్యాల పట్టణ కార్యదర్శి శివ,ఏఐయస్ ఏ . నంద్యాల డివిజన్ కార్యదర్శి వినోద్,ఏఐవైఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణు,ఏఐయఎస్ ఫ్ న ద్యాల పట్టణ కార్యదర్శి హరికృష్ణ,పిడియస్ యు నంద్యాల డివిజన్ కార్యదర్శి రాంబాబు స్థానిక నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న భారతి విద్యాసంస్థల యాజమాన్యం ఒకే బిల్డింగ్ లో ఇంటర్,డిగ్రీ,ఓపెన్ డిగ్రీ,ఐటిఐ , బిఈడి ఇన్ని రకాల కళాశాలలను నడుపుతూ ప్రభుత్వ నిబంధనలకు

## వివిధ విద్యార్థుల సంఘాల నాయకుల డిమాండ్

తూట్లు పొడుస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నదని, భారతి విద్యాసంస్థల అధినేత నాగేశ్వరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి,యాజమాన్య గుర్తింపు రద్దు చేయాలని స్థానిక నంద్యాల పట్టణంలో పద్మావతి సర్కిల్లో ధర్నా నిర్వహించారు-బీసీ,ఎస్సి,ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య సంఘాల నేతలు మాట్లాడుతూ భారతి విద్యాసంస్థల పేరుతో ఇంటర్ కళాశాల విద్యార్థులకు జాయిన్ అయ్యేటప్పుడు ఒక ఫీజు చెప్పి జాయిన్ అయ్యాక హాల్ టికెట్ కు ఒక ఫీజు,కళాశాల ఫీజు పేరుతో ఒక ఫీజు వసూలు చేస్తూ కడితే కట్టండి లేకుంటే మీ ఇష్టమొచ్చిన వాళ్లకు చెప్పుకోపొండి మాకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయి అంటూ విద్యార్థులను బేరింపులకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న భారతి జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని,రాయలసీమ యూనివర్సిటీ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కీర్తి డిగ్రీ కళాశాలలో ఎటువంటి ల్యాబ్ లు లేవు,50%పీ హెచ్ డి అధ్యాపకులు లేరు,పార్కింగ్ లేదు,కావున కీర్తి డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని,ఎటువంటి ల్యాబ్ లేకుండా,ఎటువంటి తరగతులు నిర్వహణ లేకుండా నడుస్తున్న ఆర్ జి యమ్ ఐటిఐ . కళాశాల పేరుతో భారతి విద్యాసంస్థల యాజమాన్యం చేస్తున్న నిలువుదోపిడీని అరికట్టాలని సోమవారం నుండి జరిగే ఐటిఐ ప్రాక్టీకల్ పరీక్షలకు పాస్ చేస్తామని చెప్పి ఐటిఐ విద్యార్థుల దగ్గర వసూలు చేసిన విద్యార్థుల డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆ వైపున భారతి విద్యాసంస్థల పేరుతో నంద్యాలలో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి ఆర్ ఐఓ గారు,రాయలసీమ యూనివర్సిటీలో అధికారులు,ఐటిఐ కళాశాలల జిల్లా అధికారులు స్పందించి మాములుమత్తు విడిచి పెట్టి తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టి భారతి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు విద్యాశాఖ అధికారులు డిమాండ్ చేశారు.లేని పక్షంలో భారతి విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసేంత వరకు దశలవారిగా ఆందోలన కార్యక్రమాలు నిర్వహిస్తామని,అప్పటికి స్పందన లేకపోతే విద్యాశాఖ మంత్రి గారి దృష్టికి కూడా తీసుకెళ్లి భారతి కాలేజి కేంద్రంగా విద్యార్థులకు జరిగే మోసాలకు వివరిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 8వ మహాసభలను విజయవంతం చేయండి....



నందికొట్కూరు డిసెంబర్ 11,( విభారె)డిసెంబర్ నెల,18. 19విజయవాడలో జరుగు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 8 రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యండి! సిపిఐ (ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి .పి వెంకటేశ్వర్లు. కార్యదర్శి ఔ. గోపాలకృష్ణ శనివారం నాడు పిలుపునిచ్చారు. కర్నూల్ జిల్లా నందికొట్కూర్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో మహాసభ కరపత్రం విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సంఘపరివార్ నేతృత్వంలో బిజెపి పాలన దేశాన్ని ఫాసిస్టు ప్రమాదంలో తీసుకు పోతున్నదని ఈ సమయంలో దేశాన్ని,రాజ్యాంగాన్ని ఫాసిస్టుల నుండి రక్షించుకోవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు.మన రాష్ట్రంలోని రెండు ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం పార్టీ వైయస్సార్ సిపి. బిజెపి. మోడీ సర్కార్ తెచ్చే అన్ని నల్ల చట్టాలకు పార్లమెంటులో మద్దతిస్తున్నాయని ఇక్కడ వ్యతిరేకిస్తున్నట్లు నాటకం ఆడుతూ పచ్చి అవకాశవాద రాజకీయాలు నడుపుతున్నాయని అన్నారు.గత 5 ఏళ్ళు టిడిపి పాలన అమరావతి చుట్టు తిప్పి అనవసమైన దుబరా ఖర్చులతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిస్తే ప్రస్తుతం. వై ఎస్ ఆర్ సి పి. ప్రభుత్వం మాలిక వసతులు,ఉపాది కల్పనకు పెట్ట వలసిన వ్యయాన్ని తాయిలాల పథకాల మీద ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని ధీవాళ అంచుకు తీసుకు వచ్చిందని అన్నారు. సిపిఐ (ఎంఎల్)లిబరేషన్ పార్టీ దేశ,రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే విధానాలపై పోరాడుతున్నదని ,ప్రజలు తమ ఓటు హక్కును నగదుకు,మద్యానికి గాక పార్టీ రాజకీయ,అర్దిక విధానాల మీద ఓటు చేసే విధంగా వారిని చైతన్యవంతుల్ని చేస్తుందని అన్నారు.సమాజంలోని బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీలో చేరాలని మహాసభ కరపత్రాలు పంచుతూ ప్రజలకు పిలుపునిచ్చారు.18,19 డిసెంబర్,2021 న విజయవాడలో జరుగు సిపిఐ(ఎమ్ ఎల్) లిబరేషన్ 8 వ రాష్ట్ర మహాసభలను ప్రజలు తమ వంతు సహకారం ఇవ్వాలని ఆయన. కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,యస్ షాకీర్. బి బి. తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణం కి ఆర్థిక సహాయం

## పాలకుర్తి తిక్కరెడ్డి గారు

కౌతాళం డిసెంబర్ 11,( విభారె) కౌతాళం మండలం లోని వీర్లదిన్ని గ్రామంలో కొత్త నిర్మాణం చేయనున్న కృపా ప్రార్థన మందిరం చర్చి కి 30,000/- రూపాయిలు ఆర్థిక సహాయం చేసిన మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు క్రైస్తవులకు చర్చి నిర్మాణం కి సహాయం చేయడం అదృష్టం గా బావిస్తూన్నాను అని క్రైస్తవులకు సహాయ సహకారలు అందిస్తాం అని పాలకుర్తి తిక్కరెడ్డి గారు అన్నారు స్థానిక



నంఘ ంకాపారి పాస్టర్ స్వామిదాసు గారు ప్రత్యేక ప్రార్థన చేశారు ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి గారు వీర్లదిన్ని గ్రామ నాయకులు వంక రెడ్డి, రాజశేఖరరెడ్డి, మమత రెడ్డి, అలామ్ బాషా, హనుమంతు, విరేష్, ఉసేని, విరేష్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి నివాళులు...

కర్నూలు డిసెంబర్ 11,( విభారె) మొన్న శబరిమల వెళ్తూ మార్గము మధ్యలో ప్రమాదంలో చనిపోయిన భుధవారపేట వాసి బాలకృష్ణ ఫాన్స్ అధ్యక్షుడు నంది మధు గారి సోదరుడు





ఆదినారాయణ పార్థివదేహానికి పులమాల వేసి నివాళు అర్పించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి.. ఈ సందర్భంగా చరిత రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల వేసి శబరిమలై వెళుతూ ప్రమాదంలో ఆదినారాయణ మృతిచెందడం కుటుంబ సభ్యులకు తీరనిలోటని ఆదినారాయణ కుటుంబ సభ్యులు ధైర్యంతో ఉండాలన్నారు. ఆదినారాయణ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని గౌరు చరితారెడ్డి హామీ ఇచ్చారు.(అయ్యప్ప స్వామి మరియుశివ భక్తులకు బిక్ష..)శనివారం నాడు గణేష్ నగర్ లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి పెట్టించిన అయ్యప్ప మరియు శివ స్వామి భిక్షలో పాల్గొని బిక్ష చేస్తున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి వార్డ్ ఇంచార్జి ప్రభాకర్ యాదవ్.

# రియల్ గా హీరోయిన్ కి నిద్ర లేకుండా చేసిన ఆత్మ



రియల్ లెఫ్ లో ఆత్మలు ఉన్నాయా? ఒకవేళ ఉంటే అవి ఘోషిస్తే ఎలా ఉంటుంది? అన్నది వాస్తవంగా ఆ పరిస్థితిని ఎదుర్కొన్న వారికే తెలుస్తుంది. శాస్త్రీయ ఆధారాలు లేవు అని అంటారు కానీ.. దెయ్యాలు ఉన్నాయని నమ్మేవాళ్లు చాలా ఎక్కువగా ఉన్నారు..నమ్మని వాళ్లు అంతే పెద్ద శాతం ఉన్నారు. అలాంటి సందిగ్ధంలోనే ఉన్న ఓ హీరోయిన్ రెండు నెలలు పాటు నిద్ర లేకుండా గడిపిందంటే నమ్మగలరా? దానికి కారణంగా దెయ్యమనే భ్రాంతి అని చెప్పకనే చెప్పింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే? ఆమె ఎవరో కాదు నటి పూర్ణ. పూర్ణ ప్రధాన పాత్రలో రవిబాబు అప్పట్లో 'అవును' అనే ఓ హారర్ చిత్రాన్ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే.రవిబాబు మేకింగ్..పూర్ణ పెర్ఫామెన్స్ తో నిజంగా దెయ్యాలు ఉన్నాయనిపించారు. అయితే ఈ సినిమా షూటింగ్ చేసినంత సేపు ఎలాంటి భయాలు లేవు అంది పూర్ణ. ఉదయం షూటింగ్ కి వెళ్లడం సాయంత్రం ఇంటికొచ్చి తినేసే పడుకోవడం అంతా హ్యాపీగానే సాగిందని తెలిపింది. కానీ సినిమా రిలీజ్ తర్వాత రియల్ సినిమా కనిపించిందని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. సినిమా విడుదల తర్వాత తనని బాగా తెలిసిన వ్యక్తి ఎవరో వెంటాడుతున్నారోనే భ్రాంతికి కి గురైందిట. చీకటి పడితే భయమేసిదట. బాత్ రూమ్ లో స్నానం చేస్తుంటే తన పక్కన ఎవరో వచ్చి నిలబడినట్లు..కూర్చున్నట్లు అనిపించేదని అంది.దాదాపు రెండు నెలలు పాటు అలాంటి భయానికి గురైనట్లు తెలిపింది. రెండు నెలలు కంటి మీద కునుకు లేకుండా అయిందని..తెల్లవారు ఝామును రెప్పలు మూత పడుతున్న సమయంలోనూ ఒక్కసారిగా ఉలిక్కి పడి పైకి లేచేదట. మరి పూర్ణ నిజంగా దెయ్యం వెంటాడిందా? అంతా భ్రాంతా? సినిమాని..అందులో తాను నటించిన పాత్రని ఎక్కువగా ఓన్ చేసుకోవడం వల్ల అలాంటి ఎమోషన్ కి గురైందా? అన్నది ఆమెకే తెలియాలి. పూర్ణ 'అఖండ లో'కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన ఆ సినిమా మంచి విజయం సాధించింది.ఇండస్ట్రీ వేధింపులపై ఓపెనైందిసీమ టపాకాయ్ చిత్రంతో అల్లరి నరేష్ సరసన ఎంట్రీ ఇచ్చింది కన్నడ బ్యూటీ పూర్ణ. ఆ సినిమా రిలీజ్ సమయంలో బబ్లీ పూర్ణకు విపరీతమైన క్రేజ్ నెలకొంది. అందానికి అందం నటన పరంగా జూనియర్ అశిన్ ని తలపించిందని పొగిడేశారంతా. అదే క్రమంలో పూర్ణకు తెలుగు చిత్ర సీమ నుంచి బోలెడన్ని ఆఫర్లు వచ్చాయట. అయితే కమిట్ అయితేనే ఆఫర్ అంటూ కొందరు తనని వేధించారని కూడా పూర్ణ తెలిపింది. తాను అందుకు అంగీకరించకపోవడం వల్లనే చాలా ఆఫర్లు రాలేదని అంది. తాను అలా ఉండడం వల్లనే ఇంకా ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలిగానని కూడా అందాల పూర్ణ వెల్లడించారు. అయితే తనని వేధించిన దర్శకనిర్మాతలు ఎవరు? అన్నది మాత్రం వెల్లడించలేదు.పూర్ణ ఇటీవలే అఖండలో నటించారు. ఈ సినిమా ఘనవిజయం సాధించడం తనకు ప్లస్ అవుతుందని భావిస్తోంది. ఇప్పటికే పలు చిత్రాలకు సంతకాలు చేసిందట. సుదీర్ఘ కాలం చిన్న సినిమాల్లో అయినా తనకు అవకాశాలు దక్కుతున్నాయని తెలిపింది. ప్రస్తుతం పూర్ణ బుల్లితెరపై డ్యాన్స్ రియాలిటీ షోలకు జడ్జిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. బుల్లితెర వెండితెర అవకాశాల్ని తెలివిగా సద్వినియోగం చేసుకుని కెరీర్ ని సాగిస్తోంది పూర్ణ.

# శివుడే బాలయ్య రూపంలో వచ్చాడనిపించింది: శ్రీకాంత్


ఫ్యామిలీ హీరోగా 100 సినిమాలను పూర్తి చేసిన శ్రీకాంత్ 'అఖండ' సినిమాలో ప్రతినాయకుడిగా నటించాడు. నిన్న రాత్రి జరిగిన ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ ఈవెంట్ లో ఆయన మాట్లాడుతూ .. "వైజాగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే నా సినిమాలు 'పీపుల్స్ ఎన్ కౌంటర్' .. 'మధురానగరిలో'



షూటింగులు ఇక్కడే జరిగాయి. ఇక ఇప్పుడు 'అఖండ' సక్సెస్ మీట్ ఇక్కడ జరగడమనేది చాలా సంతోషంగా ఉంది. బోయపాటితో నాకు ఇది రెండవ సినిమా. 'సరైనోడు' తరువాత నేను ఆయనతో చేసిన సినిమా ఇది.బాలకృష్ణగారి 'శ్రీరామరాజ్యం'లో లక్ష్మణుడిగా చేశాను. ఇక 'అఖండ'లో ఏ క్యారెక్టర్ ను చేశానో మీకు తెలుసు .. వరదరాజులు పాత్ర. ఈ పాత్ర ఇంత పవర్ఫుల్ గా వస్తుందని నేను ఉహించలేదు. బోయపాటిగారు ఈ పాత్రను చాలా గొప్పగా డిజైన్ చేయించారు. నా మీద నా కంటే ఆయనకే ఎక్కువ నమ్మకం ఉంది. డెఫినెట్ గా నువ్వు చేయగలవు అంటూ చేయించారు. బాలకృష్ణగారితో కలిసి నటించే అవకాశం రావడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. సెట్లో ఆయన చాలా సరదాగా ఉంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అదే ఎనర్జీతో ఉంటారు .. ఎక్కడా తగ్గదు.సిన్సియారిటీ అనేది ఆయనను చూసి నేర్చుకోవాలి. ఇప్పటికీ కూడా ఆయన ఎంతో కష్టపడుతూ ఉంటారు. ఆయనను చూసి మేము ఎనర్జీని తెచ్చుకుంటూ ఉంటాము. అమెరికా నుంచి అభిమానులు కాల్ చేసి మాట్లాడుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ఏ థియేటర్లో చూసినా 'జై బాలయ్య' అంటూ అరుస్తూనే ఉన్నారు. ఫ్యామిలీ హీరోగా చేస్తూ వచ్చిన నన్ను విలన్ పాత్రలో ఎంతవరకూ ఆదరిస్తారా అని అనుకున్నాను. కానీ ఈ సినిమా చూసిన తరువాత నాకు నమ్మకం వచ్చింది. అందుకు నేను బోయపాటిగారికి థ్యాంక్స్ చెబుతున్నాను.తమన్ ఈ సినిమాకి ఎంతో హెల్ప్ అయ్యారు. ఈ సినిమా చూస్తున్నంత సేపు నాకు బాలకృష్ణగారు కనిపించలేదు. శివుడే బాలకృష్ణగారి రూపంలో వచ్చినట్టుగా నాకు అనిపించింది. ఇప్పటికి ఈ సినిమాను నేను నాలుగు సార్లు చూశాను . ప్రతిసారి ఏదో తెలియని ట్రాన్స్ లోకి వెళ్లాను. మొత్తానికి అఖండ సినిమాలో ఏదో మేజిక్ ఉంది. ఈ సినిమా విజయానికి కారణమైన అందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని చెప్పుకొచ్చాడు.

# బిగ్ బి ఇంట్లో అద్దెకు కృతి సనన్.. రెంట్ తెలిస్తే షాకే!

బిగ్ బి అమితాబ్ ను ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నటన విషయంలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక.. వ్యక్తిగత విషయాల మీద అందరికి అన్నో ఇన్నో విషయాలు తెలుసు. కానీ.. చాలామందికి తెలీని మరో కోణం అమితాబ్ లో ఉంది.ఆయన తనకున్న ఆస్తిపాస్తులను అద్దెకు ఇస్తుంటారు. నెల తిరిగేసరికి అద్దెల రూపంలో వచ్చే ఆదాయం సైతం భారీగా ఉంటుందని చెబుతారు. తాజాగా అలాంటి డీల్ ఒకటి పూర్తి చేశారు అమితాబ్. తాజా డీల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. దీనికి కారణం ఈసారి తనకు చెందిన ఒక ప్రాపర్టీని ప్రముఖ సినీనటి కృతి సనన్ కు అద్దెకు



ఇవ్వటమే.ఒంబయి సౌత్ అంధేరిలో ఒక డుప్లెక్స్ ప్లాట్ ను ఇటీవల అమితాబ్ కొనుగోలు చేశారు. దీన్ని అద్దెకు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. ఆయన తన ప్లాట్ ను అద్దెకు ఇవ్వటం ఆలస్యం.. చాలామంది సెలబ్రిటీలు సదరు ఇంటిని అద్దెకు తీసుకోవాలని ప్రయత్నించారు. ఇందుకోసం అమితాబ్ ను సంప్రదించారు. కానీ.. ఆ అవకాశం మాత్రం ప్రముఖ సినీ నటి కృతి సనన్ కు దక్కింది. ఈ డూప్లెక్స్ ప్లాట్ కు అమితాబ్ వసూలు చేసే రెంట్ లెక్క తెలిస్తే అవాక్కు అవ్వాల్సిందే.నెలకు రూ.10లక్షల చొప్పున అద్దెను డిసైడ్ చేశారు. ఇందుకు కృతి ఓకే చెప్పింది. సెక్యురిటీ డిపాజిట్ గా రూ.60 లక్షలు చెల్లించినట్లు చెబుతున్నారు. ఇద్దరి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 2021 అక్టోబరు 16 నుంచి 2023 అక్టోబరు 15 వరకు ఈ ఇంటిని కృతి సనన్ కు అద్దెకు ఇచ్చారు. ఈ ఇంటిని 2020 డిసెంబరులో రూ.31 కోట్ల మొత్తానికి కొనుగోలు చేశారు. 2021లో ఆయన హ్యాండోవర్ కు వచ్చింది. ఇంటి మొత్తం విస్తీర్ణం 5184 చదరపు అడుగులు. అంధేరిలోని లోకండ్ వాలా రోడ్డులో ఉన్న ఈ బిల్డింగ్ లో అమితాబ్ ప్లాట్ 27 28 అంతస్తుల్లో ఉంది. అమితాబ్ కు ముంబయిలో అనేక ప్రాపర్టీలు ఉన్నాయి. వాటిని ఆయన అద్దెకు ఇస్తుంటారు. జుహూలోని వత్స.. అమ్ము అనే బంగ్లాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అద్దెకు ఇచ్చారు. మొత్తంగా తాజాగా ముగిసిన డీల్ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. దీనిపై ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ నడుస్తోంది.

# ఇంగ్లండ్ జట్టుకు భారీ షాక్..




బ్రిస్బేన్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ తొలి టెస్ట్‌లో ఆతిథ్య ఆసీస్ చేతిలో 9 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్న ఇంగ్లండ్ జట్టుకు మరో భారీ షాక్ తగిలింది. స్లో ఓవర్ రేట్(5 ఓవర్లు) కారణంగా 5 డబ్ల్యూటీసీ పాయింట్లలో కోత పడటంతో పాటు జట్టు మ్యాచ్ ఫీజు మొత్తాన్ని(100 శాతం) కోల్పోయింది. ఐసీసీ మ్యాచ్ రిఫరీ డేవిడ్ బూన్ మ్యాచ్ అనంతరం ఈ మేరకు వెల్లడించాడు. మరోవైపు, ఇదే మ్యాచ్‌లో సూపర్ శతకంతో చెలరేగిన ఆసీస్ ఆల్‌రౌండర్ ట్రావిస్ హెడ్‌కు కూడా జరిమానా విధిస్తున్నట్లు రిఫరీ బూన్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను పరుష పదజాలంతో దూషించినందుకు గాను హెడ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధిస్తున్నట్లు తెలిపాడు. ఇదిలా ఉంటే, ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో భాగంగా బ్రిస్బేన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఆతిథ్య జట్టు మూకుమ్మడిగా రాణించింది. ఫలితంగా ఈ మ్యాచ్ కేవలం నాలుగు రోజుల్లోనే ముగిసింది. నాలుగో రోజు ఆటలో ఇంగ్లండ్ నిర్ధేశించిన 20 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆతిథ్య జట్టు వికెట్ కోల్పోయి చేధించింది. అంతకముందు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 220/2 స్కోరుతో పటిష్టంగా కనిపించిన ఇంగ్లండ్ నాలుగోరోజు ఆట తొలి సెషన్‌లో తేలిపోయింది. 297 పరుగుల చేసి ఆలౌటైంది. నాలుగో రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే 82 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మలాన్ ఔట్ కావడంతో ఇంగ్లండ్ పతనం మొదలైంది. ఆ జట్టు చివరి 74 పరుగుల చేసే క్రమంలో 8 వికెట్లు చేజార్చుకుంది. రూట్ 89 పరుగులు చేయగా.. మిగతా వారు ఆశించిన మేరకు రాణించలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో లియోన్ 4, కామెరాన్ గ్రీన్, కమిన్స్ చెరో రెండు వికెట్లు తీయగా.. స్టార్క్, హాజిల్‌వుడ్ తలో వికెట్ పడగొట్టారు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 147 పరుగులకే కుప్పకూలగా.. ట్రావిస్ హెడ్(152 పరుగులు) శతక్కొటడంతో పాటు వార్నర్(94), లబుషేన్(74) రాణించడంతో ఆసీస్ 425 పరుగుల భారీ స్కోరు చేసింది.

## "కోహ్లి ఫోన్ స్విచ్ఛాఫ్.. ఏమైందో నాకు తెలియదు"

న్యూఢిల్లీ: టీమిండియా వన్డే కెప్టెన్సీ నుంచి విరాట్ కోహ్లిను తొలగించడంపై చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ అసక్తికర వాఖ్యలు చేశాడు. బీసీసీఐ, సీనియర్ సెలక్షన్ కమిటీ పారదర్శకంగా ఈ నిర్ణయం తీసుకోలేదని అతడు అభిప్రాయపడ్డాడు. "నేను విరాట్ కోహ్లితో ఇంకా మాట్లాడలేదు. అతడి ఫోన్ స్విఛ్ఛాఫ్‌లో ఉంది. టీ20 కెప్టెన్సీనుంచి తన ఇష్టంతోనే తప్పుకున్నాడు. సెలెక్టర్లు వెంటనే అతనిని వన్డే కెప్టెన్సీ నుంచి కూడా వైదొలగమని చెప్పవలిసింది. లేదంటే టీ20, వన్డే ఫార్మాట్లో కొన్నాళ్లు కొనసాగమని కోరవలిసింది. ఇలా ఒక్క సారిగా అతడిని కెప్టెన్‌గా తప్పించడం చాలా అన్యాయం "అని రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. కాగా టీ20 కెప్టెన్సీ నుంచి వైదొలగవద్దని కోహ్లిని బీసీసీఐ కోరిందని గంగూలీ చేసిన వ్యాఖ్యలను రాజ్‌కుమార్ విభేదించాడు."ప్రపంచకప్‌కు ముందు టీ20 కెప్టెన్సీ నుంచి వైదొలగవద్దని కోహ్లిని కోరినట్లు సౌరవ్ గంగూలీ చేసిన వ్యాఖ్యలను నేను చదివాను.నాకు తెలిసినట్టుగా అటువంటిది ఏమి చెప్పలేదు. గంగూలీ చేసిన వ్యాఖ్యలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190